
జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 15 పక్షపత్రిక ఆగస్టు 1-15, 2016




## రెండు దశాబ్దాల లోక్‌సత్తా ఉద్యమం - మలిదశ

(ప్రజలకు బహిరంగ లేఖ - చర్చాపత్రం)







# సేవాభావంతో ప్రజలకు వైద్యం అందించండి : జేపీ

వైద్యవృత్తి అత్యంత పవిత్రమైనదని, సమాజంలో లభిస్తున్న గౌరవాన్ని ఇంకా పెంపొందించుకునేలా యువ వైద్యులు రోగులకు సేవాభావంతో చికిత్సలు చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥జయప్రకాష్ నారాయణ్ అన్నారు. నేషనల్ యూత్ డే ఉత్సవంలో భాగంగా హైదరాబాద్ కోఠిలోని ఉస్మానియా మెడికల్ స్టూడెంట్స్ సర్వీసు, డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాల ఆడిటోరియంలో 'వైద్యుల్లో జాతీయతాభావాన్ని పునరుజ్జీవింపచేయటం' అంశం పై చర్చావేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిమ్స్ మాజీ సంచాలకులు డాక్టర్ హెచ్.సుదర్శన్, డాక్టర్ ఎల్.నరేంద్రనాథ్ కూడా హాజరయ్యారు. వైద్య వృత్తిని అభ్యసించేవారు విద్యార్థి దశ నుంచే గట్టి పునాది వేసుకోవాలని జేపీ ఈ సందర్భంగా సూచించారు. వైద్యులు నాణ్యమైన విద్యను పొందకపోతే వారి జీవితాలకు విలువలేదన్నారు. సమాజంలో నెలకొన్న దుష్పరిణామాలలో కొట్టుకుపోకుండా తమ భవిష్యత్తును బాధ్యతాయుతంగా మలచుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. వైద్యవృత్తి అత్యున్నతమైనదన్నారు. అందరికీ నాణ్యమైన వైద్య సేవల్ని ప్రభుత్వమే అందించేలా గట్టి పోరాటం చేస్తున్నామని, ప్రభుత్వ వైద్యశాలలు ప్రజలకు సేవాకేంద్రాలుగా నిలిచేలా పనిచేయలని అన్నారు. డాక్టర్లు పరిజ్ఞానంతో, ఆత్మస్థైర్యంతో పనిచేయాలని, రోగులు కూడా వైద్యుల పట్ల విశ్వాసంతో చికిత్సను తీసుకోవాలన్నారు. ఏటా 50 వేల మంది విద్యార్థులు ఈ బాధ్యతాయుత రంగంలోకి ప్రవేశిస్తున్నారన్నారు. డాక్టర్ నరేంద్రనాథ్ మాట్లాడుతూ, సమాజంలో నెలకొన్న పరిస్థితులకనుగుణంగా వైద్యరంగం వ్యాపారంగా మారటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యకళాశాలల్లో అవినీతిని రూపుమాపితే విద్యార్థులు లంచాల బారినపడకుండా పవిత్రమైన వైద్యవృత్తిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. వైద్యవృత్తి అంటే కేవలం సంపన్న వర్గాలకు సంబంధించిన విద్యార్థులకే పరిమితం అనే అపోహను పోగొట్టటానికి పేద విద్యార్థులు కష్టపడి చదివి ఈ వృత్తిలో రాణించాలన్నారు. వైద్యవిద్యను అందించే పూర్తి బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటే ప్రైవేటు కళాశాలల దోపిడీని అరికట్టవచ్చని డాక్టర్ సుదర్శన్ అన్నారు. నైతికతను వైద్యవిద్యలో భాగం చేయాలన్నారు. అనంతరం వైద్యవిద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు జేపీ, అతిథులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ, డాక్టర్ హష్మన్న, డాక్టర్ అరుణారామయ్య, వైద్యులు శ్రీకాంత్, విద్య, సంజయ్, ఇంద్రసేనా, సందీప్, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఆగస్టు 1-15, 2016

సంపుటి - 7 సంచిక - 15


## లోపలి పేజీల్లో...


రెండు దశాబ్దాల లోక్‌సత్తా ఉద్యమం ............ 5

లోక్‌సత్తా ఇరవై ఏళ్ల ప్రస్థానం ..................... 10

డియర్ ఫ్రెండ్స్ (యువతకు ఉత్తరం).............. 13

జన రాజకీయాలకు నవ మార్గాలు................ 15

రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలి......... 19

రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి సమయం ఆసన్నం.. 22

కాశ్మీర్ రాజకీయ శూన్యత- మోదీ ప్రభుత్వం...... 24

ఎన్నికల అనంతర వ్యూహమే కాశ్మీర్‌లో.......... 26

చైనాను అధిగమించాలంటే సహకార........... 29

కోర్టుల్లో మురుగు.................................... 30

ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక...... 32

పేద, మధ్యతరగతి ఆరోగ్య ఘోషకు పాట......... 33



## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్

ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


# స్పందన పెరిగితే, సంస్కరణలూ పెరుగుతాయ్



అందరూ మనలాంటి వాళ్లే, ఇతరులకో న్యాయం, మనకో న్యాయం ఉండకూడదు, మనకు లభించిన అవకాశాలు ఇతరులకు కూడా లభించాలి అన్నదే ప్రజాస్వామ్యం. ఇది తప్ప పెద్ద అర్థం కాని విషయమేమీ ఇందులో లేదు. కానీ ప్రజాస్వామ్యం ద్వారా అధికారంలోకి వస్తున్నవారిలో, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామనుకుంటున్నవారిలో ఎక్కువమంది ఈ వాస్తవాన్ని ఇంకా జీర్ణించుకోలేదు. అందరూ తోటివారిని సమానంగా చూడగలిగితే ఈ దేశంలో ప్రజాస్వామ్య సంస్కరణలకి ఇంత కష్టపడాల్సిన పనిలేదు. నోటి మాటగా ప్రజాస్వామ్యాన్ని అంగీకరించినంత తేలిగ్గా ప్రజాస్వామిక ఆలోచనలు చేయలేకపోవటమే ఈవేళ సంస్కరణలకున్న ప్రధాన అవరోధం. 'భారత్‌కు ప్రజాస్వామ్యమే పెద్ద అవరోధంగా ఉంది, అదే నియంతృత్వ వ్యవస్థ ఉంటే వేగంగా అభివృద్ధి జరిగివుండేది' అనే వాదనలు కూడా ఆ పాత శతాబ్దాల పెత్తందారీ, జమిందారీ అవశేషమైన అప్రజాస్వామిక ధోరణి నుంచి వస్తుంటాయి. సుఖసంతోషాల చుట్టూ తిరిగే ప్రకృతి సూత్రాలకు ఎక్కువ అనుగుణమైన ప్రజాస్వామ్యంలో ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులు తెచ్చుకునేందుకు వీలైన వ్యవస్థ నిర్మాణం లేకపోతేనే అసంపూర్ణంగా తయారై సంక్షోభానికి దారితీస్తుంది. కాబట్టి మనకున్న సమస్య.. ప్రజాస్వామ్యంకన్నా, నిజమైన ప్రజాస్వామ్యం లేకపోవటం అని మనం ముందుగా గుర్తించాలి. మనలో చాలామందికి పలురంగాలలో స్ఫూర్తినిచ్చే అమెరికా, జపాన్, జర్మనీ వంటి దేశాలు ప్రజాస్వామ్యంతోనే ఎంతో అభివృద్ధిని సాధించాయని మరచిపోకూడదు. అయితే మనలా వాళ్లు ముతక ప్రజాస్వామ్య దశలో ప్రజాస్వామ్యాన్ని తిడుతూ కూర్చోకుండా అవసరమైన సంస్కరణల్ని తెచ్చుకున్నారు. మనం సాంకేతిక పరిజ్ఞానంలో, జల్సాల్లో అభివృద్ధి చెందిన దేశాల నుంచి వేగంగా నేర్చుకుంటున్నాంగానీ దేశాన్ని బాగుచేసుకోవటం గురించి మాత్రం నేర్చుకోవటం లేదు. నియంతృత్వం రావాలి, ఎన్నికల్ని తీసేయాలి, విధి రాత వంటి సోమరి ఉపన్యాసాలిస్తూ తప్పించుకుంటున్నాం. మన ప్రజాస్వామ్యంలో వేగంగా నిర్ణయాలు జరగాలంటే.. పార్టీల ప్రయోజనాలు అడ్డం వస్తాయి. ఈ అపరిపక్వ రాజకీయ సంస్కృతిని సరిదిద్ది నియంతృత్వంలోని మేలైన లక్షణాన్ని సాధించేందుకే.. మౌలిక అంశాలపై ఏకాభిప్రాయ సాధనకు పార్టీలకతీతంగా పనిచేసే రాజకీయ సంస్కృతిని లోక్‌సత్తా ఆచరణలోకి తెచ్చింది. చట్టబద్ధ పాలన, విద్య, ఆరోగ్యం, అవినీతి అంతం, అధికార వికేంద్రీకరణ, ప్రభుత్వ కార్యాలయాల్లో పౌరులకు సర్వీస్ గ్యారంటీ చట్టం, న్యాయ, పోలీసు సంస్కరణలు, లాభసాటి వ్యవసాయం, ఎన్నికల సంస్కరణలు వంటి అనేక అంశాలపై అందరినీ కలిపే ప్రయత్నం చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా 'సురాజ్యం' వంటి ఉద్యమాలనూ సాగించింది. ఈ రాజకీయ సంస్కృతిని పలువురు బలహీనతగా పరిహసించినా, దీని ద్వారానే పలు కీలక చట్టాలను, రాజ్యాంగ సవరణలను ఒక్క ఎంపీ కూడా లేకుండా లోక్‌సత్తా సాధించింది. ఇలా ప్రజాస్వామ్య సంస్కరణల కోసం ప్రయత్నించే చిత్తశుద్ధి, సహనం, దూరదృష్టి లేనివారు మాత్రమే.. వేగంగా మార్పురావాలంటే ప్రజాస్వామ్యం పోయి నియంతృత్వం రావాలంటారు. ఈ దేశంలో లోక్‌సత్తా నాంది పలికిన మార్పులను, వినూత్నతలను గురించి ఇలా ఎన్నో కోణాల్లో నిజాలు మాట్లాడుకోవచ్చు. శతాబ్దాలపాటు ఎంతో మందిని చంపుకుంటూ అమెరికా, ఐరోపా వంటివి ఇప్పుడున్న స్థాయికి వచ్చాయి. ఇప్పటికీ ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. అక్కడిలాగే భారత్‌లో సమగ్ర వ్యవస్థీకృత మేలిమార్పుల కోసం లోక్‌సత్తా ఇరవై ఏళ్లుగా పోరాడుతోంది. ఆ దేశాల్లో కంటే భిన్నత్వం, సంక్లిష్టతలు ఎక్కువున్న దృష్ట్యా ఇది కష్టమే అయినా ఆ సవాలుకు లోక్‌సత్తా సిద్ధపడింది. ప్రామాణిక బహిరంగ చర్చలో నిగ్గుతేలిన భావజాలాన్ని అందించి, వేదికను నిర్మించి, ప్రజలను చైతన్యపరిచింది. సమాజం తన స్థాయిని బట్టి ఎన్నికల్లో స్పందిస్తోంది. దీనికి కూడా నిరాశ చెందటం లేదుగానీ, అమెరికా, ఐరోపాలలాగా భారత్‌కు మార్పు తెచ్చుకోవటానికి పెద్దగా సమయం లేని యుగమిది. అన్నీ ఉన్నా, అవగాహనారాహిత్యంతో, అధికార లాలసతో, కులం, మతం వంటి ద్వేషాలతో, చిన్నచిన్న విభేదాలతో.. దేశంలో, మన జీవితాల్లో వేగంగా మార్పును తెచ్చుకునే అవకాశాలను జారవిడుస్తొన్నమన్నదే బాధ.. ఇదంతా ఇప్పుడు ఎందుకు అంటే, 1996లో ప్రారంభించిన ఫౌండేషన్ డెమోక్రాటిక్ రిఫాంస్ నుంచి 1997లో ఆవిర్భవించిన లోక్‌సత్తాకి ఈ ఆగస్టు 3 నాటికి దాదాపు 20 ఏళ్లు. అజరామరమైన లోక్‌సత్తా భావాల కోసం చేతనైనంత మేర కష్టపడుతూ పనిచేస్తున్న లక్షలాదిమందికి ముందుగా అభినందనలు. 'నివారించదగ్గ బాధలను తొలగించేందుకు, పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను కల్పించేందుకు' లోక్‌సత్తా చేస్తున్న రాజీలేని బహుముఖ పోరాటాన్ని మలిదశ ఉద్యమంలో (లోక్‌సత్తా 2.0) మరింత ఉత్సాహంతో చేస్తామని చెబుతూ, సంస్కరణల వేగాన్ని పెంచగలిగే స్థాయిలో ప్రజాబాహుబలం కూడా తోడవుతుందని ఆశిస్తున్నాను. రెండో స్వతంత్ర పోరాటం చేస్తున్న లోక్‌సత్తా ఇరవై ఏళ్ల శుభాకాంక్షలతో పాటు దేశ 70వ తొలి స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలను కూడా మనసారా తెలియచేస్తూ....

మీ

## కార్టూన్ కార్నర్




.....అయితే మనమే దోషులం !

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |


♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# రెండు దశాబ్దాల లోక్‌సత్తా ఉద్యమం – మలిదశ

## (ప్రజలకు బహిరంగ లేఖ - చర్చాపత్రం)

- డా॥ జయప్రకాష్ నారాయణ్

మనదేశంలో ఉద్యమాలంటే.. అయితే ప్రభుత్వాలని, పార్టీలని తిట్టిపోయటం, లేదా తాత్కాలికంగా జనాకర్షణలని ఎరచూపించి అన్నీ ఉచితంగా ప్రభుత్వం అందించాలని ప్రజలని సమీకరించటం ఆనవాయితీ అయ్యాయి. లోక్‌సత్తా ఉద్యమం ఈ సంప్రదాయానికి భిన్నంగా వాస్తవాలు, సాక్ష్యాలు ఆధారంగా, హేతుబద్ధమయిన వాదనలతో శాస్త్రీయ పరిష్కారాలని, దీర్ఘకాలిక సంస్కరణలని ప్రతిపాదించింది. ప్రజాస్వామ్యంలో పౌరులు పౌరుల్లాగా ప్రవర్తించాలిగానీ పాలితులుగా కాదంటూ కొత్త ధోరణులతో ద్వేషరహితంగా సామరస్య వాతావరణంలో మంచి బహిరంగ చర్చను సమాజం ముందు పెట్టటంలో లోక్‌సత్తా గొప్ప విజయం సాధించింది. పార్టీల పట్ల పక్షపాత ధోరణి చూపకుండా, ఎన్నికైనవాళ్లంతా ద్రోహులు అన్న నిరాశనిరసన భావాల్ని ప్రదర్శించకుండా రాజ్యాంగ పద్ధతుల ద్వారా, సామరస్యంగా పరిష్కారాల కోసం విశేష కృషి చేయబట్టే ఈ దేశ చరిత్రలో మరే ఉద్యమమూ సాధించనన్ని ఫలితాలను లోక్‌సత్తా సాధించింది. ఎన్నో సందర్భాలలో అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించి ఎన్నో గణనీయమయిన మార్పులని సులువుగా సాధించింది.




దాదాపు ఇరవై ఏళ్ల క్రితం మన రాజకీయ వ్యవస్థని, పాలనని సమూలంగా సంస్కరించి ప్రజాస్వామ్యంలో లసుగులని ప్రజల భాగస్వామ్యంతో సరిచేయాలని లోక్‌సత్తా ఉద్యమం ఆవిర్భవించింది. వ్యక్తి స్వేచ్ఛ, స్వపరిపాలన, పౌరులకి పాలనలో భాగస్వామ్యం, చట్టబద్ధ పాలన, పొరపాట్లని ఎప్పటికప్పుడు సరిచేసే స్వయందిద్దుబాటు పద్ధతులు మూలస్తంభాలుగా మన వ్యవస్థని సరయిన గాడిలో పెట్టటం లోక్‌సత్తా మౌలిక లక్ష్యం. ఓటుకు – ప్రజల పన్నుల డబ్బుకు ఉన్న సంబంధాన్ని తెలియచెప్పి, నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించే సమగ్ర రాజకీయ, పాలనా సంస్కరణోద్యమం భారతదేశంలో లోక్‌సత్తాతోనే మొదలైంది. చాలామంది సూక్ష్మస్థాయిలో ఆ కృషిని చేసినా మొట్టమొదటి సమూల కృషి లోక్‌సత్తాదే. ప్రజల చుట్టూ తిరిగే వ్యవస్థల నిర్మాణాన్ని లోక్‌సత్తా ఒక ఉద్యమంలా మార్చింది. దేశంలో ప్రజాస్వామ్య ఉద్యమాలకు, ఎన్నో మౌలిక మార్పులకు నాంది పలికింది. ప్రజాస్వామ్యం పీఠంతో ప్రారంభమైన ప్రయత్నం లోక్‌సత్తాగా రూపుదిద్దుకుని తెలుగునాట, దేశవ్యాప్తంగా, విదేశాలలో కూడా అనేకమందిని ప్రభావితం చేసింది.

లోక్‌సత్తా ఉద్యమం తొలినాటి నుంచి ఒక వినూత్నమయిన, విశిష్టమయిన పంథాని అనుసరించింది. లోక్‌సత్తా ఆవిర్భావం వరకూ రాజకీయాలని ద్వేషించటం, తిరస్కరించటం మధ్యతరగతి వర్గానికి, యువతకి ఆనవాయితీ అయింది. లోక్‌సత్తా ఆ సాంప్రదాయానికి విరుద్ధంగా, నిజమయిన రాజకీయం పవిత్ర వ్యాసంగమని నిర్ద్వంద్వంగా ప్రకటించింది. ప్రజాస్వామ్యం, రాజకీయం అవిభాజ్యమని, రాజకీయాన్ని తిరస్కరించటం స్వేచ్ఛకి, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టవుతుందని లోక్‌సత్తా బలంగా వాదించింది. మన రాజకీయంలో ఉన్న లోపాలకి విరుగుడు మరింత మంచి, మరింత ఎక్కువ రాజకీయమేనని, ప్రజల భాగస్వామ్యంతో జనరాజకీయాన్ని సృష్టించటం అత్యవసరమని ఉద్ఘాటించింది. లోక్‌సత్తా అవిశ్రాంతంగా చేసిన ఈ పోరాటం కాలక్రమేణా దేశంలో విద్యావంతులని, మధ్యతరగతిని, యువతని, మీడియాని గణనీయంగా ప్రభావితం చేసింది. ఈ క్రమంలో మన ప్రజాస్వామ్యం దిశను, భాషను గణనీయంగా ప్రభావితం చేసింది లోక్‌సత్తా. గత మూడు దశాబ్దాలుగా ఎన్నడూలేనంతగా గతంలో రాజకీయాన్ని ద్వేషించిన వర్గాలు ఇప్పుడు రాజకీయాన్ని విస్మరించరానిదని, ఏదో ఒక రూపంలో నిజాయతీగా రాజకీయాన్ని ప్రభావితం చేయటం అవసరమని గుర్తిస్తున్నాయి.

**లోక్‌సత్తా ఉద్యమం తొలినుంచి ఆటంకానికి, విధ్వంస సంస్కృతికి స్వస్తిచెప్పింది. ఒక స్వేచ్ఛాయుత సమాజంలో ఓటుహక్కు, వాక్స్వాతంత్ర్యం, రాజ్యాంగం ఇచ్చిన హక్కులు మాత్రమే ప్రజలకు ఆయుధాలుగా ఉండాలని, ఉద్యమాలు చట్టం, రాజ్యాంగం, ఇతరుల హక్కుల రక్షణ- ఈ పరిధులకి లోబడి ఉండాలని లోక్‌సత్తా నిరంతరం నమ్మి ఆచరించింది, ఏటికి ఎదురీదింది, కొత్తరకం ఉద్యమాలకి నాంది పలికింది.**

స్వతంత్ర పోరాటంలో వలసపాలనకి వ్యతిరేకంగా కొన్నిరకాల ఉద్యమరూపాలని మన జాతి నిర్మాతలు రూపొందించారు. పరాయిపాలన పట్ల విముఖత ఉన్న కాలంలో, ప్రజలకి ఓటుగాని, ప్రాథమిక హక్కులుగాని లేనికాలంలో, పాలనని, జనజీవనాన్ని స్తంభింపజేయటం ఒక ఎత్తుగడగా రూపుదిద్దుకుంది. కానీ స్వతంత్రం వచ్చి మనం రాజ్యాంగాన్ని ఏర్పరుచుకున్నాక కూడా అదే సంప్రదాయం ఆనవాయితీగా కొనసాగుతూ వచ్చింది. ప్రజల దృష్టిని ఆకర్షించాలన్నా, పత్రికలలో సులభంగా ప్రచారం పొందాలన్నా, ప్రభుత్వాలని ఇరుకున పెట్టాలన్నా బందులు, రాస్తారోకోలు, రైల్‌రోకోలు లాంటి కార్యక్రమాలతో ప్రజాజీవనాన్ని ఆటంకపరచటం మాత్రమే మార్గమని అన్నివర్గాలు నమ్ముతూవచ్చాయి. లోక్‌సత్తా ఉద్యమం తొలినుంచి ఆటంకానికి, విధ్వంస సంస్కృతికి స్వస్తిచెప్పింది. ఒక స్వేచ్ఛాయుత సమాజంలో ఓటుహక్కు, వాక్స్వాతంత్ర్యం, రాజ్యాంగం ఇచ్చిన హక్కులు మాత్రమే ప్రజలకు ఆయుధాలుగా ఉండాలని, ఉద్యమాలు చట్టం, రాజ్యాంగం, ఇతరుల హక్కుల రక్షణ- ఈ పరిధులకి లోబడి ఉండాలని లోక్‌సత్తా నిరంతరం నమ్మి ఆచరించింది, ఏటికి ఎదురీదింది, కొత్తరకం ఉద్యమాలకి నాంది పలికింది.

నిజమయిన ఫలితాలని సాధించాలంటే వినూత్న మార్గాలు కావాలని లోక్‌సత్తా గుర్తించింది. పెట్రోలు బంకుల్లో తూనిక మోసాన్ని అరికట్టటం కోసం ముందుగా కొలిచి, ధృవపరిచిన పాత్రలలో పెట్రోలు, డీజిల్ నూనెను నింపమని పౌరులు కోరటం ఒక వినూత్న పద్ధతి. శాంతియుతంగా, చట్టబద్ధంగా కార్యకర్తలు, పౌరులు ఇలా కోరగానే మీటర్లలో మోసం బయటపడిపోయింది. కళ్లెదురుగా తూనికలలో మోసం రుజువవటంతో ఆయిల్ కంపెనీలు దేశమంతటా పెట్రోలు బంకులలో మీటర్లని సరిచేసి మోసాన్ని 90శాతం వరకు అరికట్టాయి. మన వినియోగదారులకి గత 17 సంవత్సరాలలో దాదాపు రెండు లక్షల కోట్లరూపాయలు మిగిలాయి. అతి సులభంగా, శాంతియుతంగా, చట్టబద్ధంగా, ఆర్భాటాలు లేకుండా, వినూత్న పద్ధతులలో పెనుమార్పులు ఎలా సాధించవచ్చో లోక్‌సత్తా ఆచరణలో రుజువుచేసింది. అలాగే విశ్వసనీయమయిన రీతిలో, ప్రజల భాగస్వామ్యంతో, పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నేరచరితని లోక్‌సత్తా బయటపెట్టటంతో, అది చివరికి ప్రతి అభ్యర్థీ తన వివరాలను తానే బయటపెట్టే చట్టానికి దారితీసింది. కోటికిపైగా సంతకాల సేకరణతో స్థానిక ప్రభుత్వాల సాధికారతే నిజమయిన ప్రజాస్వామ్యమనే చైతన్యాన్ని సమాజంలో పెంచింది. అవినీతి కుంభకోణంలో మునిగిపోయిన 2-జీ స్పెక్ట్రం లైసెన్సుల రద్దు కోసం సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేసి, అన్ని సహజవనరుల కేటాయింపులు బహిరంగ వేలం ద్వారాను, పోటీద్వారాను మాత్రమే జరగాలని వాదించి గెలిచింది. దాని పర్యవసానంగా 2-జీ స్పెక్ట్రం లైసెన్సుల వేలంపాటలో ప్రభుత్వానికి లక్షకోట్ల రూపాయిలకు పైగా అదనపు ఆదాయం వచ్చింది. అలాగే బొగ్గు గనుల వేలంపాటలో కేంద్ర, రాష్ట్ర

ప్రభుత్వాలకి కొన్ని లక్షల కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. ఇలా నూతన ప్రక్రియలని సృష్టించి దీర్ఘకాల మార్పుకి, నిజమయిన సంస్కరణలకి లోక్‌సత్తా శ్రీకారం చుట్టింది.

మనదేశంలో ఉద్యమాలంటే.. అయితే ప్రభుత్వాలని, పార్టీలని తిట్టిపోయటం, లేదా తాత్కాలికంగా జనాకర్షణలని ఎరచూపించి అన్నీ ఉచితంగా ప్రభుత్వం అందించాలని ప్రజలని సమీకరించటం ఆనవాయితీ అయ్యాయి. లోక్‌సత్తా ఉద్యమం ఈ సంప్రదాయానికి భిన్నంగా వాస్తవాలు, సాక్ష్యాలు ఆధారంగా, హేతుబద్ధమయిన వాదనలతో శాస్త్రీయ పరిష్కారాలని, దీర్ఘకాలిక సంస్కరణలని ప్రతిపాదించింది. ప్రజాస్వామ్యంలో పౌరులు పౌరుల్లాగా ప్రవర్తించాలిగానీ పాలితులుగా కాదంటూ కొత్త ధోరణులతో ద్వేషరహితంగా సామరస్య వాతావరణంలో మంచి బహిరంగ చర్చను సమాజం ముందు పెట్టటంలో లోక్‌సత్తా గొప్ప విజయం సాధించింది. పార్టీల పట్ల పక్షపాత ధోరణి చూపకుండా, ఎన్నికైనవాళ్లంతా ద్రోహులు అన్న నిరాశనిరసన భావాల్ని ప్రదర్శించకుండా రాజ్యాంగ పద్ధతుల ద్వారా, సామరస్యంగా పరిష్కారాల కోసం విశేష కృషి చేయబట్టే ఈ దేశ చరిత్రలో మరే ఉద్యమమూ సాధించనన్ని ఫలితాలను లోక్‌సత్తా సాధించింది. ఎన్నో సందర్భాలలో అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించి ఎన్నో గణనీయమయిన మార్పులని సులువుగా సాధించింది. ఉదాహరణకి తెహల్కా కుంభకోణం నేపథ్యంలో అన్ని పార్టీలనీ ఒప్పించి నిజాయతీ రాజకీయానికి, ఎన్నికల ప్రచారానికి కావలసిన నిధులని నిజాయతీగా, దాతలకి పన్ను రాయితీలతో సేకరించే సమగ్ర చట్టాన్ని లోక్‌సత్తా సాధించింది. అమాయక ప్రజల ఓట్లు కొనుగోలు, కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలని రెచ్చగొట్టే ఓటుబ్యాంకు రాజకీయాలు, ప్రజాధనంతో మౌలిక సదుపాయాలని, ఉమ్మడి సేవలని అందించకుండా తాత్కాలిక తాయిలాలతో ఆకర్షించే సంస్కృతి ఉన్న దేశంలో ఎన్నికల నిధుల సంస్కరణలు చాలవు. కానీ నిజాయతీ రాజకీయానికి నిజాయతీ పద్ధతులతో నిధులని సమకూర్చటం మన రాజకీయ ప్రక్షాళనలో ఒక కీలకమయిన ముందడుగు. ఇలా ప్రతి సమస్యకి వాస్తవాలు, తర్కం ఆధారంగా ఆచరణసాధ్యమయిన, జాతి భవిష్యత్తుని పదిలపరిచే దీర్ఘకాల పరిష్కారాలని సూచించటంలోను, దేశప్రజలలోను, రాజకీయ పార్టీలలోను ఏకాభిప్రాయసాధనలోను లోక్‌సత్తా చేసిన కృషి, సాధించిన విజయాలు నిరుపమానమయినవి.

ప్రజాస్వామ్య సమాజంలో రాజకీయం ప్రాధాన్యతని గుర్తించటంలోను, జనజీవనాన్ని ఆటంకపరచకుండా శాంతియుత ఉద్యమాలను రూపొందించటంలోను, హేతుబద్ధమయిన పరిష్కారాలను నిరంతరం జాతి ముందు పెట్టి ఒడుపుగా వాటిని సాధించేందుకు పోరాటం చేయటంలోను లోక్‌సత్తా ఎంతో ముందుచూపుని, వ్యూహపటిమని, ప్రజాస్వామ్య దృక్పథాన్ని ప్రదర్శించింది. ఈ పద్ధతులవల్లనే పార్లమెంటులో ఒక్క సభ్యుడు కూడా లేకుండా లోక్‌సత్తా స్వతంత్ర భారతంలో దేశచరిత్రలో మరే ఉద్యమమూ సాధించనన్ని విజయాలను సునాయాసంగా సాధించగలిగింది. నిజానికి రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచంలో మరే పౌరసమాజ ఉద్యమమూ శాంతియుతంగా, అధికారం లేకుండా ఇన్ని విజయాలు సాధించలేదు.

**లోక్‌సత్తా సాధించిన విజయాలలో కీలకమయిన కొన్ని సంస్కరణలు :**

- పెట్రోలు బంకుల్లో తూనికల మోసాన్ని చాలావరకు అరికట్టటం
- ఓటర్ల జాబితాల ప్రక్షాళన
- అభ్యర్థుల నేరచరితని, ఇతర వివరాలని ప్రకటించే చట్టం (2003)
- పార్టీల విరాళాలలో పారదర్శకతని తెచ్చే చట్టం (2003)
- పరోక్ష పన్నుల (సెంట్రల్ ఎక్సయిజ్, కస్టమ్స్) సేకరణలో కీలక సవరణలు
- పార్టీ ఫిరాయింపు నిషేధాన్ని బలోపేతం చేసే రాజ్యాంగ సవరణ (91వ సవరణ)
- మంత్రివర్గ సభ్యుల సంఖ్యని కుదించే ఏర్పాట్లు
- పాలనా సమాచార హక్కు చట్టం (2005)
- జాతీయ ఆరోగ్య మిషన్ (2005)
- స్థానిక న్యాయాలయాల చట్టం (2009)
- ఆహారధాన్యాల ఎగుమతులపై నిషేధం ఎత్తివేత, వాణిజ్య ఆంక్షల తొలగింపు
- సహకార సంఘాల స్వయంప్రతిపత్తి (97వ రాజ్యాంగ సవరణ – 2012)
- 2 జీ – స్పెక్ట్రం లైసెన్సుల రద్దు – సహజ వనరుల వేలం పాట విధానం (2013)

- లోక్‌పాల్ చట్టం (2014)
- ఉన్నత న్యాయమూర్తుల నియామకం కోసం 99వ రాజ్యాంగ సవరణతో జాతీయ జ్యుడీషియల్ నియామకాల కమిషన్ ((NJAC – 2015)
- స్థానిక ప్రభుత్వాలకి నిధుల కేటాయింపులో గణనీయ పెంపు

**వివిధ దశలలో ఉండి త్వరలో అమలుకాబోతున్న సంస్కరణలు :**

- న్యాయవ్యవస్థలో ప్రమాణాలు, జవాబుదారీతనం కోసం చట్టం
- పౌరసేవలని హక్కుగా చేసే సర్వీసు గ్యారంటీ చట్టం

విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలు, చట్టబద్ధమైన పాలన, పోలీసు సంస్కరణలు, రాజకీయ సంస్కరణలు – ఈ రంగాలలో మరిన్ని మౌలిక మార్పుల కోసం లోక్‌సత్తా కృషిని కొనసాగిస్తోంది.

ఆటనియమాలను మార్చటం ముఖ్యంగానీ ఆటగాళ్లను మార్చటం చాలదని తొలినుంచి లోక్‌సత్తా వాదిస్తూ వచ్చింది. అయితే పదేళ్ల లోక్‌సత్తా ప్రస్థానం తర్వాత మౌలికమయిన రాజకీయ సంస్కరణల్ని సాధించటం కోసం ప్రధాన పార్టీల మీద రాజకీయ ఒత్తిడి కూడా అవసరమన్న ఆలోచన కాలక్రమేణా బలపడింది. మారుతున్న సామాజిక, ఆర్థిక వ్యవస్థలు, పెరుగుతున్న పట్టణీకరణలో కనీసం పట్టణ ప్రాంతాలు, మధ్యతరగతివారు, యువతలో ఓ 20శాతంమంది నిలకడగా మన వ్యవస్థలో మార్పు కోసం ఓటు వేయటానికి సిద్ధపడితే దాని ప్రభావం మన రాజకీయ వ్యవస్థ మీద ఖచ్చితంగా ఉంటుందని లోక్‌సత్తా భావించింది. మన ఎన్నికల వ్యవస్థలో 15–20శాతం ఓట్లు వచ్చినంత మాత్రం చేత ఆ పార్టీలకు చట్టసభలో ప్రాతినిధ్యం లభించదు. కానీ ప్రజల్లో మార్పు కోరే వారి సంఖ్య పెరుగుతుందనే ఉద్దేశం ప్రతి పార్టీనీ ప్రభావితం చేస్తుంది, వాటి విధానాల్ని, ఆలోచనని, రీతిని ప్రభావితం చేస్తాయి. ప్రజలు మార్పును కోరుతున్నారన్న సాక్ష్యాలు ఓట్ల రూపంలో బలంగా కనపడ్డప్పుడు మాత్రమే ప్రధాన పార్టీలు స్పందించి మార్పును తీసుకున్నాయని ప్రపంచంలోని అన్ని ప్రజాస్వామ్యాల అనుభవం చెబుతోంది. అందుకే, మార్పుని కోరే ప్రజల ఓటుని సంఘటితం చేసి మన రాజకీయ, పాలనా సంస్కరణలు వేగవంతం చేయటం కోసం ఓ వర్గంగానూ, ఒక నిజమైన నాగరిక ప్రజాస్వామ్యంలో పార్టీల తీరు, బహిరంగ చర్చ ప్రమాణాలు ఎలా ఉండాలో ఆచరణలో చూపెట్టాల్సిన అవసరముందన్న ఆలోచనతోనూ లోక్‌సత్తా పార్టీ ఏర్పడింది. అయితే, పార్టీకి ప్రజల మనసుల్లో ఆదరణ ఉన్నా మన ఎన్నికల వ్యవస్థ కారణంగా, మన సమాజంలో రాజకీయంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా లోక్‌సత్తాకు లభిస్తున్న ఓట్లు మనదేశంలో వేగంగా గణనీయ మార్పుల్ని సాధించటానికి కావలసిన వాటికంటే బాగా తక్కువ వచ్చాయి.

**ఎన్నికలలో అక్రమ ఖర్చు ఈ రెండు దశాబ్దాలలో పది నుంచి ఇరవై రెట్లు పెరిగింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలలో ఎన్నికల ఖర్చు విపరీతంగా పెరిగిపోయి, రాజకీయం పూర్తిగా వ్యాపారంగా మారిపోయింది. దాంతో ప్రభుత్వాలు మారినా అధికారాన్ని స్వంత లాభం కోసం దుర్వినియోగం చేయటం, రాజకీయంలో అనారోగ్యకరమయిన పోటీవల్ల ఓట్లు కొనుగోలు చేయటం, పదవులని కేవలం అక్రమార్జన కోసం మార్గాలుగా భావించటం మరింతగా పెరిగిపోయాయి.**

ఇదే సమయంలో గత 20 ఏళ్లలో దేశ రాజకీయాలలో, రాజ్యవ్యవస్థలో కొన్ని మంచి మార్పులు వచ్చాయి, వస్తున్నాయి. కానీ అవి ఈదేశం సుస్థిర అభివృద్ధికి, అందరికీ ఎదిగే అవకాశాలకు భరోసా ఇచ్చేందుకు చాలవు. కొన్ని రంగాలలో సంక్షోభం మరింత పెరుగుతూ వస్తోంది. ఎన్నికలలో అక్రమ ఖర్చు ఈ రెండు దశాబ్దాలలో పది నుంచి ఇరవై రెట్లు పెరిగింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలలో ఎన్నికల ఖర్చు విపరీతంగా పెరిగిపోయి, రాజకీయం పూర్తిగా వ్యాపారంగా మారిపోయింది. దాంతో ప్రభుత్వాలు మారినా అధికారాన్ని స్వంత లాభం కోసం దుర్వినియోగం చేయటం, రాజకీయంలో అనారోగ్యకరమయిన పోటీవల్ల ఓట్లు కొనుగోలు చేయటం, పదవులని కేవలం అక్రమార్జన కోసం మార్గాలుగా భావించటం మరింతగా పెరిగిపోయాయి. ఓటుకి, ఎన్నికయ్యే ప్రభుత్వానికి, ప్రజలకంతే నిజమయిన ఫలితాలకి మధ్య సంబంధం తెగిపోవటంతో కుల,మతాల సమీకరణ, ప్రజల దీర్ఘకాల ప్రయోజనాలని తాకట్టుపెట్టి తాత్కాలిక తాయిలాలు ఆశచూపటం సర్వసాధారణమయిపోయాయి.

1980ల దశకం దాకా దేశంలో కేంద్రీకరణ పెరిగిపోయి కేంద్ర ప్రభుత్వ పెత్తనంలో రాష్ట్రాలు నలిగిపోయాయి. అయితే 1990ల నుంచి వచ్చిన రాజకీయ, ఆర్థిక మార్పుల వల్ల ఫెడరలిజం బలపడి రాష్ట్రాలకి అధికారాలు, వనరులు

పెరిగాయి. అయితే అదేసమయంలో రాజ్యనిర్వహణలో రాష్ట్రాలకున్న వెసులుబాటు తగ్గిపోతున్నది. రాష్ట్రాలకి రాజ్యాంగం కేటాయించిన అంశాలలో కూడా కేంద్ర చట్టాలలో, లోపభూయిష్టంగా చేసిన రాజ్యాంగ సవరణలు రాష్ట్రాలకి వెసులుబాటు లేకుండా చేస్తున్నాయి. ఉదాహరణకి మంచి ఉద్దేశాలతోనే 73, 74 రాజ్యాంగ సవరణలు, విద్యాహక్కు చట్టం, భూసేకరణ చట్టం, ఆహార భద్రతా చట్టం వంటివి వచ్చాయి. కానీ దేశంలో ఉన్న భిన్నత్వాన్ని, వైవిధ్యాన్ని పరిగణలోకి తీసుకోకుండా అన్ని రాష్ట్రాలకి, ప్రాంతాలకి ఒకే మూసని వర్తించే ప్రయత్నం వల్ల చాలా చిక్కులు ఎదురవుతున్నాయి. ప్రజలకి ఫలితాలు అందకుండా పోతున్నాయి. నిజానికి మనదేశంలో ప్రజలు ఎన్నికలలో తీర్పునిచ్చేది రాష్ట్ర ప్రభుత్వాలపైన. పార్లమెంటు నుంచి పంచాయతీ ఎన్నికల దాకా ప్రజలు కేవలం రాష్ట్ర ప్రభుత్వం పనితీరుని బట్టి, ఆ ప్రభుత్వం మీద తమకున్న అభిప్రాయాలని బట్టి ఓటు వేస్తున్నారు.

జవాబుదారీతనం రాష్ట్రాలకే ప్రధానంగా ఉన్నప్పుడు, ప్రజలకు సేవలందించటానికి పరిపాలన మొత్తాన్ని పునర్వ్యవస్థీకరించే వెసులుబాటు కూడా రాష్ట్రాలకి కూడా ఉండటం అవసరం. దేశ ఐక్యతని కాపాడుకోవటం కోసం కేంద్రానికి ఉన్న సర్వాధికారాలని కొనసాగిస్తూనే, రాష్ట్రాలలో ప్రభుత్వ విధానాన్ని, స్థానిక ప్రభుత్వాన్ని, పాలనాయంత్రాంగాన్ని ప్రజల మద్దతుతో సంస్కరించే వెసులుబాటు రాష్ట్రాలకి ఉండటం అవసరం.

విద్య, ఆరోగ్యం దేశమంతటా అధ్వాన్నస్థితిలో ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థ కొంతమేరకు పెరుగుతున్నా, ఆ సంపద సృష్టిలో బీదవర్గాలకి, సరయిన విద్య, ఆరోగ్యం అందని సామాజిక వర్గాలకి తగిన వాటా అందటం లేదు. ఆధునికయుగంలో పుట్టుకతో వచ్చిన అంతరాలని తొలగించాలంటే, కులంతో, కుటుంబ బీదరికంతో, తల్లిదండ్రుల చదువుతో నిమిత్తం లేకుండా, పుట్టిన ప్రతి బిడ్డకి మంచి ప్రమాణాల విద్య అందే ఏర్పాట్లు, ప్రతి కుటుంబానికి జేబులో డబ్బు ఖర్చు లేకుండా మంచి ఆరోగ్యం అందే ఏర్పాట్లు ఉన్నప్పుడే సమాన అవకాశాలు అన్ని వర్గాలకు అందుతాయి. అలా జరగకపోతే అసమానతలు పెరిగిపోవటంతోపాటు నూటికి 80మంది ప్రజలకి సంపద సృష్టిలో భాగస్వామ్యంగాని, ఉపాధి అవకాశాలుగాని ఉండవు. ఈ పరిస్థితి దేశ ఆర్థిక భవిష్యత్తుకి, సామాజిక శాంతికి ప్రమాదంగా పరిణమిస్తుంది.

దేశంలో కోట్లాదిమంది యువత, మధ్యతరగతి, ఆలోచించేవారు, స్థానికంగా సమస్యలని పరిష్కరించే నేర్పరితనం ఉన్నవారు, ప్రజలని సంఘటితం చేసే శక్తి, విశ్వసనీయత కలవారు ఉన్నారు. కానీ మన కేంద్రీకరించిన పాలన వారిని సమస్యల పరిష్కారంలో భాగం చేయటం లేదు. పట్టణాలలో ఆస్తిపన్ను, ఇతర పన్నులు కట్టినా ఏ సేవలు సరిగ్గా అందక ప్రజలలో ఓ వంక అసహనం, మరోవంక మనం ఏమీ చేయలేమనే అసహాయత పెరుగుతున్నాయి. సమస్యల్ని పరిష్కరించేవారు కేవలం నిత్య ఆందోళనకారులుగానో, అర్జీలిచ్చి అర్థించేవారిగానో ఉండవలసి వస్తోంది. మంచి సంకల్పంతో ప్రారంభించిన స్వచ్ఛ భారత్‌లాంటి కార్యక్రమాలు కూడా అనుకున్న మేరకు ఫలితాలు సాధించకపోవటానికి కారణం స్థానిక ప్రభుత్వాలకి, ప్రజలకి తగిన పాత్ర లేకుండా చేయటం.

ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇతర రాజకీయ, పాలనా సంస్కరణలతోపాటు కీలకమయిన సంస్కరణలని వెంటనే సాధించటం దేశ భవిష్యత్తుకి అవసరం:

1. కేంద్రం అధికారాలకి, దేశ సమగ్రతకి భంగం లేకుండా రాష్ట్రాల పూర్తి స్వయం నిర్ణయాధికారాలనిచ్చి ప్రజలకి పూర్తిస్థాయిలో సేవలందించే వెసులుబాటునివ్వటం

2. ఉత్తమ ప్రమాణాల విద్యని ప్రతి బిడ్డకీ అందించటం, ప్రతి కుటుంబానికీ జేబులో ఖర్చు లేకుండా ఉత్తమ ప్రమాణాల ఆరోగ్యాన్నందించే వ్యవస్థని ఏర్పరచటం

3. స్థానిక ప్రభుత్వాలకి, పౌరులకి పూర్తి బాధ్యతలు, పన్నుల్లో వాటాని అందించి స్థానికంగా సమస్యల పరిష్కారంలో, విధానాల అమలులో వారిని పూర్తి భాగస్వాములని చేయటం.

వీటితోపాటు, ప్రజల్ని చీలుస్తూ సమాజాన్ని ఇంకా నష్టపరుస్తున్న శతాబ్దాల అమానుష కులవ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యపరిచి కులరహిత సమాజం దిశగా నడిపించటం, పరిజ్ఞానంతో ప్రశ్నించే యువనాయకులను ఎక్కడికక్కడ తయారుచేసేందుకు పౌరసత్వ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించటం కార్యక్రమాల్ని కూడా సామాజిక సంస్కరణ కార్యక్రమాలుగా చేపట్టటం అవసరమని లోక్‌సత్తా మలిదశ ఉద్యమం ప్రతిపాదిస్తోంది.

లోక్‌సత్తా మలిదశ ఉద్యమ చర్చల్లో, సదస్సుల్లో, కార్యక్రమాల్లో ప్రజలు, ముఖ్యంగా దగాపడ్డవర్గాలు, మహిళలు, యువత పెద్దఎత్తున భాగస్వాములు కావాలని, మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ★

# లోక్‌సత్తా ఇరవై ఏళ్ల ప్రస్థానం.. ఒక అవలోకనం

**- లోక్‌సత్తా (బండారు) రామ్మోహనరావు**

ప్రజాస్వామ్య పాలనా సంస్కరణల కోసం ఆవిర్భవించిన (చేపట్టిన) ప్రజాస్వామ్య ఉద్యమంగా లోక్‌సత్తా దేశంలోనే ఒక నూతన వరవడిని సృష్టించి కార్యాచరణనూ ఆచరించింది. ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం (ఎఫ్‌డీఆర్)గా మొదలై.. ప్రజాస్వామ్య సంక్షోభాలుంటాయనీ, ఆ సంక్షోభాలకు సరైన పరిష్కారాలు కూడా ఉన్నాయని గుర్తించి ఆ స్ఫృహతో లోక్‌సత్తా ఆవిర్భవించింది. సమాజమున్నంత కాలమూ సమస్యలుంటాయనీ, ఆ సమస్యలకు మరింత సమస్యలను జోడించని పరిష్కారాలు కావాలిగానీ, ఆ సమస్యను మరింత జటిలం చేయకూడదన్నదే లోక్‌సత్తా భావన. ఇరవై ఏళ్ల క్రితం ఒక స్వచ్ఛంద సంస్థ అంటే రాజకీయాలు మాట్లాడని, రాజకీయాలతో సంబంధం లేని, రాజకీయాలను అసలే పట్టించుకోని, రాజకీయం అంటరానిదైనట్టు ప్రవర్తించేది. అదే అర్థంలో స్థాపించేవారు. అదేపనిగా ఈ భావాన్ని ప్రచారం చేసేవారు. మాకు రాజకీయాలతో సంబంధం లేదు, పార్టీలకతీతమైన సంస్థ, రాజకీయాలకు అతీతమైన (ఎన్‌జీవో- నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్)దిగా పనిగట్టుకుని ప్రచారం చేసేవారు. కానీ లోక్‌సత్తా మొట్టమొదటి నుంచీ రాజకీయం ఒక పవిత్ర వ్యాసంగం – ఆ రాజకీయాల్లోని చెడును చూసి అంతా అదే అనుకునేదీ తప్పుడు అభిప్రాయం అని ఎలుగెత్తి చాటింది. రాజకీయాల్లో విలువలు దిగజారుతున్నాయి, సమాజం కూడా అదే పరిస్థితిలో ఉంది అర్థం చేసుకొమ్మంది.. ఏ దేశ రాజకీయాలనైనా అంచనా (అసెస్) వేస్తే సమాజాన్ని కూడా అంచనా వేయవచ్చునని, సమాజం ఎలా ఉంటే ఆ రాజకీయాలు కూడా అలాగే ఉంటాయని భావించింది. సమాజం మారాలంటే మొదట రాజకీయం మారాలని లోక్‌సత్తా భావించింది. ఇది పిచ్చి ముందా – పెళ్లి ముందా అనే ప్రశ్నలాంటిదే కానీ ఇవి రెండూ ఏకకాలంలో జరగాలంది.

తెలుగు డిక్షనరీలో మాటలకు అర్థాలు వెతికితే, 'కంపు' అని అన్నా, 'వాసన' అన్నా ఒకటే అర్థం ఉంది. కానీ మనం వ్యవహారాలలో 'కంపు' అంటే దుర్వాసనగానూ, వాసన అంటే రంగు రుచి లేని ఒక పదంగానూ రాసుకుంటున్నాం. నిజానికి కంపు, వాసన డిక్షనరీలో అర్థం ఒకటే.. వాసనకు 'సువాసన' అనే పదం జోడించుకుంటున్నాం. రాజకీయాలకు కూడా ఇప్పుడు అర్థం మారిపోయింది. రాజకీయం అంటే రాక్షసంగా జనానికి కీడు చేసే యంత్రాంగం అనే అబ్రివేషన్స్ కూడా ఏనాడో బయలుదేరాయి. మన అబ్బాయికి కాలేజీలో సీటు రాకపోయినా, మన అమ్మాయికి పెళ్లి కాకపోయినా, ఏదైనా మోసానికి, నమ్మకద్రోహానికి గురైనా రాజకీయం అనే పేరు పెట్టుకుంటున్నాం. అంతా రాజకీయమైపోయిందని వాపోతుంటాం. అంటే రాజకీయం అంటే 'అంత చీప్'గా మనం అలవోకగా దుర్మార్గం అనే అర్థంలో వాడుతున్నాం. కానీ, రాజకీయాలతో ప్రమేయం లేకుండా సమాజం లేదని, సమాజ హితానికి రాజకీయాలకు అవినాభావ సంబంధం ఉందని, సమాజం బాగుపడాలంటే వ్యక్తి సుఖానికీ, సమాజ హితానికి వారధి కట్టేది నిజమైన రాజకీయమని, రాజకీయానికి నేటి విస్తృతార్థంలో కాకుండా పూర్వార్థంలోని నిజమైన రాజకీయాన్నే తీసుకోవాలని లోక్‌సత్తా నిష్కర్షగా చెప్పింది. అందుకే రాజకీయాలను ద్వేషించకుండా ప్రేమించమంది. లోక్‌సత్తా ఇరవై ఏళ్ల ప్రస్థానాన్ని ఒకసారి అవలోకనం చేసుకుంటే, 1996లో బీజాలు పడిన లోక్‌సత్తా 1997 ఆగస్టు 3న ఊపిరిలూదుకుని 1998లో 'స్వరాజ్యం' అనే ఒక పుస్తకాన్ని ప్రచురించింది. పాలనలోని అనేక విషయాలను తెలుపుతూ, అనేక ప్రభుత్వ శాఖల్లో నిబంధనాలు పనులు ఎలా చేసుకోవాలో ఆ పుస్తకం ద్వారా తెలిపింది. స్వరాజ్యం పుస్తకాన్ని అప్పటి గవర్నర్ రంగరాజన్‌తో ఆవిష్కరింప చేసింది. ఆ తర్వాత అలుపెరగకుండా ఇరవై ఏళ్లుగా అనేక ప్రజాస్వామ్య ఉద్యమాలు చేపట్టింది. చాలా విజయాలు సాధించింది కూడా. ఉదాహరణకు 1998లో ప్రారంభించిన పెట్రోలు బంకులలో తూకాలు, స్వచ్ఛత, నాణ్యత విషయం నుండి ఉద్యమాలు మొదలుపెట్టిన లోక్‌సత్తా.. రైతులకు లాభసాటి ధర రావడానికి అంతర్రాష్ట్ర మార్కెట్‌కు, అంతర్జాతీయ మార్కెట్‌కు విస్తరించాలని, నిబంధనలు,

అడ్డుగోడలు పనికిరావని వ్యవసాయంలో స్వేచ్ఛా మార్కెట్‌ను అభిలషిస్తూ కర్ణాటక, మహారాష్ట్రలకు 'వడ్ల సంచులు' మోసి ప్రభుత్వం పెట్టిన అర్థంలేని నిబంధనలు, చట్టాలను ఉఫ్‌మని ఊదేస్తూ ధిక్కరించింది. దమ్ముంటే మమ్మల్ని అరెస్టు చేయాలని ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని సవాల్ చేసింది. దాని ఫలితమే 36 కిలోమీటర్ల నడక యాత్ర రైతులకు రూ. 3,600కోట్ల లాభం రైతులకు చేకూర్చిన మహాయాత్రగా వర్ధిల్లింది. 'లోక్‌సత్తా ఉద్యమాలు చేసిందా' అని అమాయకంగా ప్రశ్నించినవారికి ఇది ఒక అర్థమయ్యే సమాధానమైంది. ఉద్యమాలంటే ధర్నాలు, రాస్తారోకోలు, బంద్‌లు కాదు.. జన జీవితానికి రోజువారీ పనులకు ఆటంకం కలగకుండా వారిని మమేకం చేసుకుని నడిపేవే ఉద్యమాలు అని లోక్‌సత్తా రుజువు చేసింది. అందుకే లోక్‌సత్తా ఏదైనా నిరసన వ్యక్తం చేస్తే, దానికి ముందస్తు పర్మిషన్ కోరితే పోలీసువారు ఎప్పుడూ అనే ఒక మాట 'లోక్‌సత్తాచట్టాన్ని ఉల్లంఘించదుగా, పర్మిషన్ ఇచ్చేస్తాం'. కొందరైతే మీకు పర్మిషన్ ఏంటి సార్.. మీరు ఎలాగూ క్రమశిక్షణతోనే ఉంటారుగా అనేవారు. లోక్‌సత్తా మీద, రాజకీయ సంస్కృతి మీద అంత నమ్మకం. ఒక ఊరేగింపు చేసినా, శాంతియాత్ర, ధర్నా చేసినా చివరకు ఎన్నికల ప్రచారంలో కూడా పోలీసులకు పనిచెప్పని సంస్థ ఏదైనా ఉంటే అది లోక్‌సత్తానే. అందుకే లోక్‌సత్తా బందోబస్త్ అంటే పోలీసులకు ఆటవిడుపే.. పనేం ఉండదుగా, అరెస్టులు, లాఠీఛార్జీలు గట్రా ఉండవుగా..

ఉద్యమం అంటే గొడవ, ఉద్యమం అంటే జనజీవితానికి ఆటంకం, బంద్‌లు, రాస్తారోకోలైతే జనజీవితంతో ఆడుకోవటం.. ఇలా ప్రజాస్వామ్యం పేరుతో నిరసనలు చేసే క్రమంలో బ్రిటీషు ప్రభుత్వం మీదో, నైజాం రాజో, ఇతర రాచరిక వ్యవస్థపైనో పోరాటం చేసిన వలసవాద, తిరుగుబాటు పద్ధతులనే స్వతంత్ర భారతంలోనూ రాజకీయ పార్టీలు, ఇతర స్వచ్ఛంద సంస్థలూ అనుసరించాయి. అవి 'కాలం చెల్లిన' నిరసన రూపాలనీ, వాటికి ప్రత్యామ్నాయ ఉద్యమ కార్యాచరణను ఎన్నుకోవాలని మొదట చెప్పిందే లోక్‌సత్తా. అందుకే బంద్‌ల్నో, రాస్తారోకోల్లాంటి నిరసన రూపాల్నో లోక్‌సత్తా ఏనాడూ చేపట్టలేదు. అందుకే కొందరు లోక్‌సత్తా ఉద్యమాలు చేసిందా అని ప్రశ్నలేస్తూ అవహేళన చేస్తున్నా.. చిరునవ్వుతో సమాధానం చెబుతూనే తనదైన కార్యాచరణతో ఈ ఇరవై ఏళ్లూ నిలిచింది లోక్‌సత్తా.

ఈ సంస్కరణ అయినా, ఆయా రంగాల్లో వారిని విస్మరించి చేస్తే అది సంస్కరణ కాదని మొదటగా గుర్తించింది లోక్‌సత్తా. అందుకే రాజకీయ సంస్కరణలకు రాజకీయ పార్టీలతో, పాలనా సంస్కరణలను నిపుణులూ, అధికారులూ, ఆయా రంగాల్లో నిష్ణాతులతో లోక్‌సత్తా చర్చించింది. పోలీసు సంస్కరణలు పోలీసులతో, న్యాయసంస్కరణలు న్యాయమూర్తులు, న్యాయవాదులతో, వాణిజ్య సంస్కరణలు వాణిజ్య వర్గాలతో, అధికార వికేంద్రీకరణకు స్థానిక ప్రభుత్వాలలో ఎన్నికైన ప్రజాప్రతినిధులతో.. ఇలా పలు సంస్కరణలకు రంగం సిద్ధం చేయడానికి ఆయా వర్గాలవారిని పరిగణలోకి తీసుకుని వారితో సమావేశాలు, ముఖాముఖిలు ఏర్పాటు చేసింది. ప్రజలతో మమేకమై వారి సమస్యలకు వారి ద్వారానే పరిష్కారం చెప్పించింది. ఇదే ప్రజల భాగస్వామ్యమంటే అని నిరూపించింది.

ఫ్యాక్షనిస్టులు కూడా లోక్‌సత్తా మధ్యవర్తిత్వాన్ని కోరుకున్నారు. ఏదైనా పంచాయతీ జరిగితే రాజకీయ నాయకులు-పార్టీలు లోక్‌సత్తా అభిప్రాయం కోసం ఎదురుచూసేలా చేసింది లోక్‌సత్తా. లోక్‌సత్తా భావజాలానికి, రాజకీయ సంస్కృతికి, కృషికి ఉన్న విశ్వసనీయత అలాంటిది. లోక్‌సత్తా 'బ్యాడ్జీ' పెట్టుకుని ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లినా, రాజకీయ పార్టీ సమావేశాలలో ప్రజాభిప్రాయం ప్రతిఫలించినా వారు ఇచ్చిన విలువే వేరుగా ఉండేది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఈ విషయంలో లోక్‌సత్తా తనదైన రీతిలో ఏం చెబుతుందా అని ఎదురుచూసే ఒక వాతావరణాన్ని తన నిర్విరామ కృషితో లోక్‌సత్తా నిర్మించుకుంది. ఇదంతా గొప్పల కోసం కాకుండా రాజకీయ సంస్కృతిలో మార్పు దిశగా ఉపయోగపడాలని వినమ్రంగా చెబుతున్నదే. ప్రశ్నించే సమాజం కోసం మొదట విషయ పరిజ్ఞానాన్ని అందించి, ఆ సమాజంలోని వారిని సంఘటితపరిచి, పోరాటానికి ఉద్యమాలకు సన్నద్ధపరచటానికి 'జన శిక్షణ' అనే కార్యక్రమం ద్వారా లక్షలమంది గ్రామీణ, పట్టణ పౌరులకు శిక్షణనిచ్చింది లోక్‌సత్తా. ఏదైనా సమస్య వస్తే.. అది ఎన్నికల సంస్కరణలు కావచ్చు, రాజకీయ సంస్కరణలు కావచ్చు, పాలనా సంస్కరణలూ కావచ్చు.. వాటిపై లోక్‌సత్తా ప్రజాభిప్రాయం కోసం అనేక సమావేశాలు పెట్టింది. ప్రభుత్వాల దుర్మార్గ పోకడలను ప్రశ్నిస్తూ.. చివరకు రాష్ట్రపతి జారీ చేసే ఆర్డినెన్స్‌ను కూడా ప్రజల సమక్షంలో దహనం చేసి నిరసన వ్యక్తం చేసి ధర్మాగ్రహాన్ని చాటింది లోక్‌సత్తా. రాజకీయాలలో నేరచరితుల వివరాలను ప్రకటించటంతోపాటు ఉమ్మడి వేదికల ద్వారా

అభ్యర్థులను నిలదీసిన వారిని ప్రశ్నించే పౌరసమాజ చైతన్యం తెచ్చింది లోక్‌సత్తా. పార్టీ ఫిరాయింపుల చట్టం, మంత్రివర్గంలో కనీస సంఖ్య, స్థానిక న్యాయాలయాల ఏర్పాటు వంటివి లోక్‌సత్తా సాధించినవే.

'అధికారంలో ఉన్నవారికం టే ఎక్కువే సాధించినా, సాధించినదానికి సంతృప్తి చెంది అదే విజయమనుకుంటే పొరపాటని' లోక్‌సత్తా గ్రహించింది కనుకే, లోక్‌సత్తా మలిదశ ఉద్యమాన్ని (లోక్‌సత్తా 2.0) మొదలుపెట్టింది. లక్ష్యాలు అవే కదా మళ్లీ మలిదశ అనే పేరు ఎందుకు అనే ప్రశ్న ఉదయిస్తుంది. లక్ష్యాలు అవేగానీ కార్యాచరణలో వేగం పెరగడానికి, లక్ష్యాల విషయంలో మరింత స్పష్టత రావడానికీ, మలిదశ కార్యాచరణను లోక్‌సత్తా సవినయంగా సమాజం ముందుంచడానికి జిల్లా సదస్సులు ఏర్పాటు చేసింది. ఉదాహరణకు ఒకనాటి జాతీయోద్యమ పోరాటంలోగానీ, తెలంగాణ సాయుధ పోరాటంలోగానీ ఉపయోగించిన నిరసన రూపాలు, ఉద్యమ లక్ష్యాలు- స్వతంత్ర భారత్‌లో నిరసన రూపాలు, ఉద్యమ లక్ష్యాలు వేరుగా ఉన్నట్టే, నేటికి ఇరవై ఏళ్ల క్రితం ఏర్పడిన లోక్‌సత్తా ఉద్యమ లక్ష్యాలలో మరింత పదును, మరింత అవగాహన ప్రజలలో.. ముఖ్యంగా యువతలో మారిన పరిస్థితుల నేపథ్యంలో అవసరమని లోక్‌సత్తా భావిస్తోంది. లోక్‌సత్తాది జనరేషనల్ మిషన్ కాబట్టి ఈ అప్‌గ్రేడేషన్ సర్వసాధారణ పరిణామక్రమంలో భాగం.

నిప్పు కనుక్కోవడం నుంచీ.. ఆ తర్వాత చక్రం.. ఇలా అనేక ఆవిష్కరణల తర్వాత రైళ్లు, విమానాలు, రాకెట్ల యుగంలోకి ప్రవేశించాక.. నేడు సమాచారం ఇచ్చిపుచ్చుకునే పద్ధతులు మారాయి. సోషల్ మీడియాను సకారాత్మకంగా వాడుకునే 'ఒడుపు' అవసరం మరింత పెరిగింది. సెకన్లలో సమాచారవ్యాప్తికి వీలైనప్పుడు మన లక్ష్యాలను అంతే షార్ప్‌గా అందించాల్సిన అవసరం ఏర్పడింది. లక్ష్యాలు పాతవే.. వాటిని మరింత సరళీకరించి సూటిగా, సుత్తిలేకుండా అందించే 'మలిదశ వ్యోమనౌక' నేటి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ అనేలా తయారుచేసే క్రమంలో మలిదశ ఉద్యమం అవసరమైంది. కొత్త తరానికి సరికొత్త ఆలోచనలు జోడించి ప్రజాస్వామ్య ఉద్యమాలకు సమాయత్తం చేసే ఆలోచన.. దానికి కావలసిన వాహనం అప్‌గ్రేడ్ అయింది. అస్త్రం మారింది. లక్ష్యంలో స్పష్టత ఉన్నా మార్గం కూడా మంచిది కావాలి. అప్పుడే లక్ష్యాన్ని సాధించితీరతాం. సాధించింది గోరంత.. సాధించాల్సింది కొండంత.

**త్రాసు-చక్కర**

సమాజంలో ఇరవై ఏళ్లుగా అనేక ఉద్యమాలు చేశామని చెబుతున్నారు. నిజంగా అంత చేస్తే.. ఇరవై వరకు మౌలిక రాజకీయ, పాలన, ప్రజా సంస్కరణలను తెస్తే, ఇంకా సాధించాల్సింది ఉందంటూ లోక్‌సత్తా చెబుతుంది.. ఇంకెంత కాలం పడుతుంది అనే నిరాశనిస్పృహలను అప్పుడప్పుడు కొందరు మిత్రులు వ్యక్తం చేస్తుంటారు. దానికి లోక్‌సత్తా సవినయంగా చెప్పే సమాధానమేమిటంటే..

ఇప్పటి ఎలక్ట్రానిక్ తూకాలు, ప్యాకింగ్ వస్తువులు లేని ఇరవై ఏళ్ల వెనక్కి వెళ్తే ఒక కిలో చక్కర బరువు తూచడానికి త్రాసును వాడే సమాజంలో.. త్రాసులో ఒక పక్క తూకం రాయి, మరోపక్క చక్కర పోస్తే.. ఆ పోసిన చక్కర తొమ్మిది వందల గ్రాములున్నా త్రాసులోని 'ముల్లు' చక్కర వైపు మొగ్గదు. ఆ తర్వాత తక్కువ ఉన్న మిగతా వంద గ్రాముల చక్కర మెల్లమెల్లగా పోస్తుంటే చివరి మిల్లీగ్రాముల చక్కర పోసేంతవరకూ ముల్లు మధ్యకు రానట్టే.. సమాజంలోని సంస్కరణలు సాధించినా అది తొమ్మిదివందల గ్రాముల చక్కర లాగే ఉండొచ్చు. తతిమ్మా వంద గ్రాముల చక్కర కీలకమైంది. అవి సాధించేదాకా సాధించింది కూడా పెద్దగా కనపడదు. లెక్క మారదు. సరిగ్గా కిలోకి వెయ్యిగ్రాములు నిండాలిగా మరి. శ్రీకృష్ణ తులాభారంలో తులసీదళానికి ఎంత విలువ ఉందో.. మన మలిదశ ఉద్యమానికీ అంత నిర్వచన ప్రాధాన్యత ఉంది.

పరిణామాత్మకమైన మార్పు.. గుణాత్మకమైన మార్పునకు దోహదపడుతుందనేది లెక్కల్లో సూత్రం. సరిగ్గా అదే సూత్రాన్ని లోక్‌సత్తా అన్వయించుకుంటుంది. ఆ సూత్ర స్ఫూర్తిని కూడా లోక్‌సత్తా అనుసరిస్తుంది.

సూత్రం తప్పయితే లెక్క తప్పవుతుంది. అలాగే మనం ఎక్కడున్నామో తెలుసుకుంటే ఎక్కడికెళ్లాలో తెలుస్తుంది. ఇరవై ఏళ్ల లోక్‌సత్తా తాజా మలిదశ ఉద్యమ 'లక్ష్యం' స్పష్టంగా ఉన్నప్పుడు కార్యాచరణే తేలాల్సింది. ఇది ఏకపక్షంగా ఖరారు చేసేది కాదు. కలిసికట్టుగా ప్రజలతో కూర్చుని నిర్ణయించేది. కార్యాచరణకు రంగం సిద్ధం చేయడానికి అందులో యువత, మహిళలను కలుసుకోవడానికి, తెలుగునాట చర్చావేదికలు, సమావేశాలు నిర్వహించి మరింత స్పష్టతతో ముందుకెళ్లడానికి లోక్‌సత్తా కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు మీ వంతు సహకారం అందించాలని పౌరసమాజాన్ని కోరుతున్నాం. లోక్‌సత్తా 2.0 మలిదశ ఉద్యమంలో మరింత ఉద్యమస్ఫూర్తితో పాల్గొనాలి. ★

# డియర్ ఫ్రెండ్స్

## యువతకు ఉత్తరం

- పి. రాజీవ్
రచయిత, ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి



***జేపీగారు రూ.100కోట్లో, 200కోట్లో తెచ్చి అందరికీ మద్యం, బిర్యానీలు పంచి ఏర్పాటు చేసిన వేదిక కాదు ఇది. అలాంటి వేదికలు చాలా వచ్చాయి, పోయాయి. కొన్ని కొనసాగుతున్నా వాటి వల్ల జనానికి ఒరిగేదేమీ లేదు. ఇది (లోక్‌సత్తా) త్యాగాల పునాదుల మీద నిర్మితమైంది. దీని వెనక ఎన్నో సౌఖ్యాలను, పదవులను, అవార్డులను, గుర్తింపులను, ఆదాయాన్ని వదులుకున్న అపారమైన మేధో, శారీరక కష్టం ఉంది. ఐఏఎస్ అనేది జేపీగారికి ప్రజలు ఇచ్చిన పదవి కాదు. ఆయన సొంత మేధస్సుతో కష్టపడి పొందిన ఆ ఉన్నత పదవిని త్యాగం చేసి ఈ వేదికను నిర్మించగా, సమాజంలో చాలామంది మేధావులు, విద్యార్థులు, యువతీయువకులు, మహిళలు తమ వంతు సమయాన్ని డబ్బును ఇవ్వగా నేడు దేశంలోనే ఎవరూ సాధించని ఫలితాలను సాధించి పెట్టింది.***

ఇరవై ఏళ్ల లోక్‌సత్తా అనివార్యమైన పరిస్థితుల్లో నేడు ఎన్నికలకు విరామం ప్రకటించి, మలిదశ ఉద్యమరూపంలో బయలుదేరుతున్న సందర్భంలో మనం ఉన్నాం. ఈ మలిదశ ఉద్యమంలో ముఖ్యంగా యువత, విద్యార్థులు కీలకమైన భాగస్వామ్యం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ దేశంలో విద్య, వైద్య రంగాలలో సమూలమైన మార్పులు తెచ్చి అందరికీ ఉచిత, నాణ్యమైన విద్య, వైద్యం అందించటానికి జేపీ గారు శ్రీకారం చుట్టిన ఈ మహాకార్యంలో యువతగా, విద్యార్థులుగా మన వంతు బాధ్యతను నిర్వహించకపోతే చరిత్ర మనల్ని క్షమించదు.

ఒక్కొక్కసారి చరిత్ర మన భుజాల మీద బాధ్యతను పెడుతుంది. దానిని విస్మరించినవారు పిరికివాళ్లు అవుతారు. అలాంటివారి జాబితాలో మనం చేరకుండా మన చదువులు, ఉద్యోగాలు/వ్యాపారాలు చూసుకుంటూనే మెరుగైన సమాజం కోసం కొంత సమయాన్ని కేటాయించి పనిచేయాలి. ఇప్పటికే ఈ అవగాహన కలిగిన యువత పునరంకితం కావాల్సి ఉ ంది. 2014 ఎన్నికలకు ముందు.. 2012-13 ప్రాంతంలో తెలంగాణ ఉద్యమం తీవ్రస్థాయిలో ఉన్న సమయంలో జేపీగారు చెప్పిన సమగ్ర, సామరస్య పరిష్కారాలను అర్థం చేసుకోలేనివారు, అర్థం చేసుకున్నా లోక్‌సత్తా ఉనికిని జీర్ణించుకోలేనివారు ఈ ప్రాంతంలో మనకు కొంత అననుకూలతను సృష్టించారు. అలాంటి రోజుల్లో కూడా విద్యార్థిసత్తా, వైబీఐ (యూత్ ఫర్ బెటర్ ఇండియా) లాంటి వేదికలతో ఎంతో కొంత పనిచేశాము. కానీ ప్రస్తుతం ప్రజలకు

వాస్తవాలు అర్థమవుతున్నాయి. మనకు అననుకూల పరిస్థితులుగానీ, వ్యతిరేకతగానీ లేవు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన రంగాలలో మౌలిక మార్పులు సాధించుకోవడం ద్వారా అంతిమంగా మన జీవితాల్లో ఏ విధంగా వెలుగులు నింపుకోవచ్చో జనానికి అర్థమయ్యేట్టు వివరించటానికి ఇది అనువైన సమయం.

పేద, మధ్యతరగతివారు కష్టపడి సముపార్జించిన దాంట్లో అత్యధికభాగం విద్య, వైద్యానికే ఖర్చుపెడుతున్నారు. ఉదాహరణకు, సంవత్సరానికి 3లక్షల రూపాయల వార్షిక ఆదాయం ఉన్న కుటుంబం కేవలం విద్య, వైద్యానికే 2లక్షలు ఖర్చుపెడుతోంది. మిగిలిన లక్షరూపాయలు ఇతర అన్ని ఖర్చులకు సరిపోకపోవడం వల్ల అప్పులు చేస్తున్నారు. తద్వారా పేదరికం నుండి బయటపడలేకపోతున్నారు. అంతరాలు లేకుండా జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటే.. ప్రజల మీద పెనుభారం తప్పుతుంది. కష్టపడి సంపాదించిన సొమ్మును మిగిలిన అవసరాలకు అప్పులు లేకుండా కాస్త వెసులుబాటుతో ఖర్చు చేసుకోగలుగుతారు. పేదరికం నుంచి బైటపడగలుగుతారు. దేశం కూడా సుస్థిర ఆర్థికాభివృద్ధిని సాధిస్తుంది.

ప్రపంచంలో మనకంటే అనేక రెట్లు ఆర్థికాభివృద్ధి సాధించిన అనేక దేశాల విజయరహస్యం ఇదే. మరి మనల్ని 70 ఏళ్లుగా పరిపాలిస్తున్నవారికి ఈ విజయ రహస్యం తెలియదా? విద్య, వైద్యం అందకపోవటం, కొందరికే పరిమితం కావటం మన ఖర్మ అని మెజారిటీగా ఉన్న సామాన్య ప్రజలు అనుకోవచ్చు. కానీ విద్య, వైద్యం, ఉపాధి కల్పన రంగాలను బాగుచేసుకునేంత వరకు మనకు పేదరికం నుంచి విముక్తి లభించదు అనే అక్షరసత్యం అన్ని పార్టీలవారికీ తెలుసు. కానీ వారు చచ్చినా చేయరు. వారు చేయకపోవడానికి 2 ప్రధాన కారణాలు ఉన్నాయి.. 1) అందరూ కడుపు నిండినవారుగా మారితే తమను దేబిరించే వారు ఎవరూ ఉండరు. దేబిరించేవారు లేకపోతే తమ పార్టీల మనుగడే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితులు రావచ్చు 2) ప్రజలు కూడా తమ ఖర్మ అనుకుంటున్నారు తప్ప నాణ్యమైన విద్య, వైద్యం అందించటం ప్రభుత్వ మొట్టమొదటి బాధ్యతల్లో ఒకటి అని గుర్తించటం లేదు. అందుకే వీటి కోసం ఎన్నికల్లో గట్టిగా డిమాండ్ చేయటం లేదు.. చివరికి ప్రపంచవ్యాప్తంగా చాలా కమ్యూనిస్టు దేశాలు ఉచిత విద్య, వైద్యం అందించినా.. మనదేశంలో కమ్యూనిస్టు పార్టీలు ఈ ఊసే ఎత్తకుండా పెత్తందారీ అధికార పార్టీలకు తందానా అన్నాయి.

విద్య, ఆరోగ్యాలను రాజకీయానికి కేంద్రబిందువు చేయడానికి లోక్‌సత్తా గట్టిగా పోరాడుతోంది. కానీ దానికి ప్రజాబాహుబలం కూడా తోడవ్వాలి. అందరికీ నాణ్యమైన, ఖర్చులేని విద్య, ఆరోగ్యం అందాలి అనేది ప్రజల ప్రధాన డిమాండ్‌గా మారాలి. ఇందుకోసం పోరాడుతున్న లోక్‌సత్తాకు ప్రజలు అన్నిరకాలుగా అండగా నిలవాలి. విద్య, ఆరోగ్య రంగాలకు ప్రతినిధిగా ఉద్యమాన్ని తీర్చిదిద్దే బాధ్యతను ప్రతి లోక్‌సత్తా సభ్యుడు/సభ్యురాలు కూడా తీసుకోవాలి. లోక్‌సత్తా దేనికి ప్రతినిధి అని ఎవరైనా అడిగితే– ఈ దేశంలో ప్రజలందరికీ ఉచితమైన, ఖర్చులేని విద్య, వైద్యం అందించే మహత్తర కార్యానికి అని ప్రజలు చర్చించుకునేస్థాయికి మనం తీసుకుపోవాలి.


ఒక్కసారి ప్రజల డిమాండ్‌గా మారిన తర్వాత ఇక దాన్ని ఆపడం ఎవడితరం కాదు. అన్ని పార్టీలవాళ్లూ ఇష్టంలేకపోయినా ముందు మేమంటే మేం అంటూ నిలబడతారు. క్రెడిట్ లోక్‌సత్తాకు ఇవ్వకున్నా నష్టం లేదు. ప్రజలు ఏదోకరోజు ఖచ్చితంగా గుర్తిస్తారు. ఒకవేళ ముందే ప్రజలు గుర్తించి అవకాశం ఇస్తే, దీన్ని బాగుచెయ్యండి బిడ్డా అని అంటే.. ఎన్నికల గురించి ఆలోచించవచ్చునేమోగానీ అప్పటి వరకూ ఈ ఎజెండాని ప్రజల్లోకి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవడమే మన పని.

చివరిగా ఒక్క మనవి. జేపీగారు రూ.100కోట్లో, 200కోట్లో తెచ్చి అందరికీ మద్యం, బిర్యానీలు పంచి ఏర్పాటు చేసిన వేదిక కాదు ఇది. అలాంటి వేదికలు చాలా వచ్చాయి, పోయాయి. కొన్ని కొనసాగుతున్నా వాటి వల్ల జనానికి ఒరిగేదేమీ లేదు. ఇది (లోక్‌సత్తా) త్యాగాల పునాదుల మీద నిర్మితమైంది. దీని వెనక ఎన్నో సౌఖ్యాలను, పదవులను, అవార్డులను, గుర్తింపులను, ఆదాయాన్ని వదులుకున్న అపారమైన మేధో, శారీరక కష్టం ఉంది. ఐఏఎస్ అనేది జేపీగారికి ప్రజలు ఇచ్చిన పదవి కాదు. ఆయన సొంత మేధస్సుతో కష్టపడి పొందిన ఆ ఉన్నత పదవిని త్యాగం చేసి ఈ వేదికను నిర్మించగా, సమాజంలో చాలామంది మేధావులు, విద్యార్థులు, యువతీయువకులు, మహిళలు తమ వంతు సమయాన్ని డబ్బును ఇవ్వగా నేడు దేశంలోనే ఎవరూ సాధించని ఫలితాలను సాధించి పెట్టింది. అజరామరమైన ఇలాంటి వేదిక తాత్కాలికంగా పడిపోయినా అది మన సమాజానికి గొడ్డలిపెట్టు. కావున దీన్ని నిలబెట్టుకోవాలి. యువకులుగా, విద్యార్థులుగా ప్రతి గ్రామం, ప్రతి కళాశాల తిరిగి నాణ్యమైన, ఖర్చులేని విద్య, ఆరోగ్యం, ఉపాధి గురించి తెలియచేయాలి. అవి సాధించుకునేంత వరకు మనకు దారిద్ర్యం నుంచి శాశ్వత విముక్తి లేదు. కాబట్టి నిర్విరామ పోరాటంతో సాధించుకుందాం.

జై లోక్‌సత్తా ★

# జన రాజకీయాలకు నవ మార్గాలు

పార్టీలు, నేతలు, వారి కుటుంబాల చుట్టూ తిరిగే రాజకీయాన్ని ప్రజల చుట్టూ తిప్పి నిజమైన ప్రజాస్వామ్యాన్ని ప్రతిష్టించేందుకు, పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు కల్పించేందుకు కొత్త రాజకీయ సంస్కృతితో లోక్‌సత్తా *1996-97*లో ప్రారంభించిన సంస్కరణోద్యమాన్ని ఆరోజు వింతగా చూసినా ఈరోజున ఆ ప్రభావం దేశవ్యాప్తంగా క్రమంగా కనిపిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దగ్గర్నుంచి అనేకమంది రాజకీయ నేతలు, పౌర సమాజ ఉద్యమాలు లోక్‌సత్తా భాష మాట్లాడుతున్నాయి. ఇక ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అయితే లోక్‌సత్తా విత్తనంతో మొలకెత్తిన మొక్క. ఓట్లు సాధించటంలో ఇంకా విజయం సాధించలేకపోయినా భావజాలంపరంగా దేశంలోనే పెద్ద పార్టీగా లోక్‌సత్తా గుర్తింపుపొందింది. అధికారం లక్ష్యంగా కాకుండా నిజమైన మార్పు లక్ష్యంగా లోక్‌సత్తా వెదజల్లిన భావాలపరంపర దేశీయంగా, విదేశాల్లో సైతం పలువురు భారతీయులను ప్రభావితం చేసింది. కొత్త తరానికి కొత్త రాజకీయం, జన రాజకీయం, ప్రజలే ప్రభువులు-పాలకులు సేవకులే, మంచి రాజకీయాల్ని మించిన పవిత్ర వ్యాసంగం మరొకటి ఉండదు, చెడ్డ రాజకీయానికి విరుగుడు మరింత మంచి రాజకీయమే వంటి అనేక పదాల్ని, పదబంధాల్ని, వ్యక్తీకరణల్ని తన భావజాలానికి తగ్గట్టు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రత్యేకించి తయారుచేశారు. దీనివెనక దశాబ్దాల అధ్యయనం, అసాధారణ ప్రజాజీవిత అనుభవాలు ఉన్నాయి. ఇలా తన భావజాలాన్ని తానే రాసుకుని, వాటి కోసం వేదికను నిర్మించి తానే ప్రచారం చేసుకున్న నాయకులు ప్రపంచంలోనే చాలా అరుదుగా కనిపిస్తారు. ఇతర దేశాలన్నిటికంటే కూడా సువిశాలమైన, సంక్లిష్టమైన భారత్‌లో ఈ ప్రయత్నం కష్టమైనదైనా, వినూత్నమైనదైనా లోక్‌సత్తాకు స్ఫూర్తినిచ్చిన ప్రతి దేశం, సంస్థ, పార్టీ, నాయకుడు, నాయకురాలు గురించి జేపీ ఎప్పుడూ ప్రస్తావిస్తుంటారు. ఎందరో భుజాల మీద నుంచి చూస్తుండబట్టే తనకు అంత దీర్ఘదృష్టి సాధ్యమైందంటుంటారు. పార్టీలు వేరైనా, దేశ ప్రయోజనాల దగ్గరికొచ్చేసరికి అన్ని పార్టీలూ ఒకటే అని చెబుతూ పక్షపాత రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల నేతలతో ఆయన స్నేహపూర్వక సంబంధాలను కొనసాగిస్తుంటారు. పార్టీల మధ్య శత్రుత్వం దేశప్రయోజనాలకు భంగం కలుగుతుండటం వల్లే *2012*లో అన్ని పార్టీలకూ ఒక తక్షణ ఉమ్మడి ఎజెండాను రూపొందించే లక్ష్యంతో సురాజ్య ఉద్యమాన్ని నిర్మించారు. ఆ ఎజెండాపై చైతన్యం కోసం మూడు రోజుల నిరాహార దీక్ష చేశారు. ఈ ఉదార రాజకీయం నేపథ్యంలోనే పరస్పర విరుద్ధమని చెప్పుకునే బీజేపీ, కమ్యూనిస్టులు, కాంగ్రెస్ తదితర పార్టీలన్నిటితో లోక్‌సత్తా కలిసిపనిచేయగలుగుతోంది. ఇంతకుముందే అనుకున్నట్టు.. లోక్‌సత్తాకు క్రెడిట్ ఇవ్వకున్నా, లోక్‌సత్తా భావాల్ని, విధానాల్ని డిమాండ్ చేసే కొంత మార్పు ఇటీవల పలు పార్టీలు, సంస్థలు, సంఘాల్లో కనిపిస్తోంది. విద్య,




ఆరోగ్యం, అవినీతి లేని పాలన, మద్య నియంత్రణ, వికేంద్రీకరణ తదితర సంస్కరణల గురించి ఎన్నడూ మాట్లాడని సోషలిస్టు భావజాలురు కూడా ఇటీవల ఆ అంశాలను ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. తాజాగా భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆంధ్రప్రదేశ్ సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఇటీవలి ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాసిన వ్యాసంలో లోక్‌సత్తా రాజకీయ సంస్కృతిని, ఎజెండాని ఈ దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రముఖ పరిష్కారంగా పేర్కొన్నారు. లోక్‌సత్తా పేరును ప్రస్తావించకపోయినా, ఆ వ్యాసంలోని కొన్ని భావాలు, వ్యాఖ్యలతో లోక్‌సత్తా ఏకీభవించకపోయినా వారి సానుకూల రాజకీయం అభినందనీయమని లోక్‌సత్తా భావిస్తోంది. మంచి ఎవరి ద్వారా జరుగుతోందన్నది పట్టించుకోకపోతే మన ద్వారా ప్రకృతి/దైవం అద్భుతాలు చేయిస్తుందని విజ్ఞులు అంటుంటారు. సీపీఐకి, ముప్పాళ్ళకు ధన్యవాదాలు తెలియచేస్తూ ప్రజల్లోకి బలంగా వెళ్లాల్సిన అంశాలున్న ఈ వ్యాసాన్ని స్థూలంగా లోక్‌సత్తా టైమ్స్ ద్వారా కూడా అందిస్తున్నాం...

భారత రాజకీయాలు క్రమంగా సంపన్న కుటుంబాల వారసత్వాలుగా మారాయి. పార్లమెంటుకు రూ.100కోట్లు, అసెంబ్లీకి 20కోట్లు ఖర్చు పెట్టిన అభ్యర్థులను చూస్తున్నాం.

స్థానిక ఎన్నికలకు కూడా లక్షలు, కోట్లు ఖర్చు పెడుతున్న పార్టీలు, అభ్యర్థులు ఉంటున్నారు. ఇంతింత పెట్టుబడి పెట్టి రాజకీయాల్లోకి రాత్రికి రాత్రే వచ్చే ప్రజాప్రతినిధులు పేదలకు మేలు చేస్తారని భ్రమిస్తే అది ప్రజల తప్పే. ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్) నిర్వహించిన ఒక సర్వే ప్రకారం 2004–2015 మధ్య 11 సంవత్సరాల కాలంలో వివిధ పార్టీలు ఎన్నికల ఖర్చు నిమిత్తం వసూళ్లు చేసిన మొత్తం రూ.5,683.44 కోట్లు. పలు జాతీయ, ప్రాంతీయ పార్టీలు భారత ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికల ఆధారంగా ఈ లెక్క గణించబడింది. లెక్కలు చూపని వసూళ్లు, నల్ల కుబేరులు అనామత్తుగా ఇచ్చినది మొత్తం కలిపితే ఈ వసూళ్లు ఎన్ని వేల కోట్లకు చేరుకుంటాయో?

గత మేలో ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల వివరాలను పరిశీలిస్తే మరికొన్ని కొత్త విషయాలు తెలుస్తాయి. ఎలక్షన్ వాచ్ సంస్థ అయిన ఏడీఆర్ ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల బరిలోకి దిగి విజయం సాధించిన 812 మంది అభ్యర్థులు సమర్పించిన ప్రమాణ పత్రాలను విశ్లేషించగా అందులో 428మందికి (53శాతం) కోటి రూపాయల కంటే ఎక్కువ ఆస్తులు ఉన్నాయని తేలింది. పోటీలో నిలిచిన అభ్యర్థుల వివరాలను పరిశీలిస్తే, తమిళనాడులో 553మంది, పుదుచ్చేరిలో 96మంది, పశ్చిమ బెంగాల్‌లో 244మంది, అస్సాంలో 238మంది కోటీశ్వరులే. ఆశ్చర్యకర అంశమేమంటే, తమిళనాడులో ఎన్నికైన శాసనసభ్యుల్లో 76శాతం మంది కోటీశ్వరులే. కాగా పుదుచ్చేరిలో 83శాతం మంది శాసనసభ్యులు కోటీశ్వరులు. ఫలోక్తి ఏమంటే, అన్ని రాష్ట్రాలలో ఎన్నికైన శాసనసభ్యులలో 186మంది (23శాతం) అసలెప్పుడూ ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయనేలేదు. కేరళలో అయితే 60శాతం మంది విజేతలు ఆదాయపు పన్ను జోలికి పోగలిగిన స్థాయిలో లేనివారు. 49మందికి పాన్ నంబరే లేదు. ఆస్తి వివరాల విషయానికి వస్తే, ఎమ్మెల్యేలు కూడా పార్లమెంటు సభ్యులకు ఏమాత్రం తీసిపోరు. వివిధ రాష్ట్రాలలోని ప్రాంతీయ బూర్జువా పార్టీలు ఇంతకు ఏమాత్రం తక్కువగా లేవు. 2014లో అత్యధిక ఆస్తులున్నట్టు వెల్లడించిన మొదటి ముగ్గురిలో 1) గుంటూరు పార్లమెంటు సభ్యులు గల్లా జయదేవ్ (టీడీపీ) రూ.685కోట్లు 2) కొండా విశ్వేశ్వర రెడ్డి, చేవెళ్ల (టీఆర్ఎస్) రూ.528 కోట్లు 3) గోకరాజు గంగరాజు, నరసాపురం (బీజేపీ) రూ.288కోట్లు తెలుగు రాష్ట్రాలకు చెందినవారవటం గమనించాలి. 2013–14తో పోలిస్తే అధికార పక్షాల విరాళాల సేకరణ 151శాతానికి పెరిగింది. ఈ గణాంకాలను పరిశీలిస్తే బూర్జువా పార్టీలు ఒకదానితో ఒకటి పోటీపడి ధన ప్రభావంలో మునిగితేలుతున్నాయి.

ఈ గందరగోళంలో ఏర్పడిన సరికొత్త పరిణామం విచ్చలవిడి పార్టీ ఫిరాయింపులు. ఫిరాయింపులు కొత్తవేమీ కాకపోయినా ఎదుటివారు పాల్పడితే బూతుగాను, తాము చేస్తే నీతిగాను ప్రజలను నమ్మింపజూనటం బూర్జువా పార్టీల నైజంగా మారింది. తెలంగాణలో కేసీఆర్, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నిస్సిగ్గుగా బరితెగించి ఫిరాయింపులను ప్రోత్సహించటం ప్రజాస్వామ్యానికే అవమానం. దీనికి పరాకాష్ట ఉత్తరాఖండ్‌లో బీజేపీ అనైతిక రాజకీయ క్రీడ. నైతిక ప్రమాణాలలో తమను మించినవారు లేరనే కేంద్ర బీజేపీ మోదీ ప్రభుత్వం కక్కుర్తిపడి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చీల్చి రాష్ట్రపతి పాలనను విధించింది. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడింది. ముఖ్యమంత్రి రావత్ మళ్లీ ముఖ్యమంత్రిగా బలపరీక్షలో నెగ్గి ప్రమాణస్వీకారం చేశారు. ఫిరాయింపు చేసిన ప్రజాప్రతినిధులెవరైనా తమ పదవికి రాజీనామా చేయటం కనీస నైతిక ధర్మం.

రాజకీయాలలో నేరచరితుల సంఖ్య పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మరో ప్రమాదకర హెచ్చరికగా ఉంది. 2013 అక్టోబరులో ప్రజాస్వామ్య హక్కుల సంఘం సమర్పించిన నివేదిక ప్రకారం ఆనాటికి 162మంది ఎంపీలు, దేశం మొత్తం మీద 1200 మందికి పైగా ఎమ్మెల్యేలు నేరచరితులు. అతి గంభీర నేరారోపణలున్న 10మంది రాజకీయ నాయకులలో ఎల్.కె అద్వానీ, రాజనర్సింగ్, అమిత్‌షా, వరుణ్‌గాంధీ, ఒవైసీ సోదరులు, పి. కరుణాకరన్, రషీద్ మసీద్, అదిన్ రంజన్ చౌదరి, నవజ్యోతిసింగ్ సిద్ధు ఉన్నారు. లాలూప్రసాద్ యాదవ్, ఓం ప్రకాష్ చౌతాలా, జయలలిత, కరుణానిధి, ఎ. రాజా, కనిమొళి, ములాయం సింగ్ యాదవ్, నితిన్ గడ్కరీ తీవ్ర ఆర్థిక నేరారోపణలతో మునిగిన ఇతర రాజకీయ ప్రముఖులుగా ఉన్నారు. 16వ లోక్‌సభకు అత్యధిక సంఖ్యలో నేరచరితులు ఎన్నికయ్యారు. కొత్తగా ఎంపీలయినవారిలో నేరస్తులు 34శాతం ఉన్నారు. ఈ సంఖ్య 14, 15 లోక్‌సభలలో వరుసగా 24శాతం, 34శాతంగా ఉంది. కొత్తగా ఎన్నికైనవారిలో 33శాతం బీజేపీ, 18శాతం కాంగ్రెస్ సభ్యులు నేరచరితులే. నేరస్తులు కానివారి కంటే నేరచరితులైనవారికి రెట్టింపు విజయావకాశాలున్నాయని ఏడీఆర్ విశ్లేషించింది. మోదీ మంత్రులలో 13 మందిపై (మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు ముందు) తీవ్ర క్రిమినల్ నేరాలున్నాయి. ప్రధాని కాగానే రాజ్యసభలో మోదీ న్యాయవ్యవస్థ ద్వారా కళంకిత సభ్యులను పార్లమెంటు నుండి ఊడ్చిపారేస్తానని హూంకరించారు. అటువంటి ప్రక్రియ నేటికీ ప్రారంభించక ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు.

విదేశాలలో మూలుగుతున్న నల్లధనాన్ని తెప్పించడంలోను, స్వదేశంలో ఉన్న నల్లధనాన్ని వెలికితీయడంలోను మోదీ విఫలమవ్వడమేగాక స్వచ్ఛంద వెల్లడింపు పథకాల ప్రకటన ద్వారా నల్లకుబేరులకు ప్రోత్సాహకాలు ప్రకటించారు. 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వేలో భారతదేశంలో 62శాతంమంది ఏదో ఒక రూపంలో తమ అవసర నిమిత్తం అవినీతిని ప్రోత్సహించక తప్పని పరిస్థితి ఉందని వెల్లడైంది. ప్రపంచం మొత్తం మీద అవినీతి ర్యాంకుల్లో 76వ స్థానంలో భారత్ ఉంది. పౌరసేవలను అవినీతిరహితంగా ప్రజలకు అందించగలిగిన ప్రభుత్వాలు అధికారంలో ఉంటే గరిష్టంగా అవినీతిని అరికట్టవచ్చు. రాజకీయాలలో పడిపోతున్న విలువలను పునరుద్ధరించడానికి సామాజిక చైతన్యంతో కూడిన ప్రజాఉద్యమాన్ని ప్రారంభించాలి.

దామాషా ఎన్నికల విధానాన్ని మనదేశంలో ప్రవేశపెట్టుటకు తగిన ఎన్నికల సంస్కరణలను చేయాలి. ధన రాజకీయాలను గరిష్టంగా తగ్గించటానికి ఇది బ్రహ్మాస్త్రంగా ఉపయోగపడుతుందని గుర్తించి అందుకు ప్రజాఉద్యమాన్ని నిర్మించాలి. నల్లధనాన్ని గుర్తించిన సందర్భాలలో శిక్షను కఠినతరం చేయాలి. అమ్నెస్టీ పథకాలను ఉపసంహరించుకోవాలి. ప్రజాప్రతినిధుల ఆస్తులు, అప్పుల వివరాలతో శ్వేతపత్రాన్ని ప్రభుత్వమే విడుదల చేయటం, ఈ దిశగా ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించటం, అనూహ్యంగా ఆస్తులు పెరిగిన సందర్భాలలో పార్టీలే సంజాయిషీ కోరటం, తొలగించటం, క్రమశిక్షణ చర్యలు తీసుకోవటం జరగాలి. రాజకీయ అవినీతిపై బలమైన ఆధారాలున్న వ్యక్తులపై ప్రభుత్వమే దావా వేసి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఏర్పాటు చేయాలి. అక్రమ ఆస్తుల స్వాధీనానికి సంబంధించిన చట్టాలను, నిబంధలను కఠినంగాను, వేగంగాను అమలయ్యే విధంగా మార్పులు చేయాలి. అధికార పీఠం దక్కించుకునేందుకు అడ్డదారులు తొక్కే రాజకీయ సంస్కృతికి కళ్లెం వేయాలి. రాజకీయ పార్టీలు నిజాయతీపరులకు టికెట్లు కేటాయించాలి. అందుకు తగిన చట్టాన్ని తేవాలి. ప్రభుత్వ పాలనను మరింత పారదర్శకం చేయటం, సిటిజన్ చార్టర్ వంటి ప్రణాళికల అమలును పటిష్టం చేయటం, అధికారులను అందుకు బాధ్యులుగా చేసి చర్యలు తీసుకోవటం, ప్రజలకు సకాలంలో సేవలు అందని చోట నష్టపరిహారం చెల్లించటం.. ఈ ఏర్పాట్లు చేయాలి. రైట్ టు సర్వీసెస్‌ని హక్కుగా చేసి ప్రజలు ప్రభుత్వ సేవలను సులభంగా పొందే అవకాశం కల్పించాలి. గెలిచిన అభ్యర్థులను రీకాల్ చేసే అధికారాన్ని ప్రజలకు ఇవ్వాలి. క్రిమినల్ నేరాలకు పాల్పడ్డవారిని, దేశద్రోహానికి పాల్పడ్డవారిని ఎన్నికలలో పాల్గొనకుండా అనర్హులను చేయాలి. ★



## కొత్త జిల్లాలతో వికేంద్రీకరణ జరిగేనా?

అక్టోబర్ 11న విజయదశమి నుంచి కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలు ఆవిర్భవించిన రోజు నుంచే కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా యంత్రాంగం బాధ్యతలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు అన్నారు. ప్రజల అవసరాలు, భావోద్వేగాలను సమన్వయం చేసుకుంటూ శాస్త్రీయంగా జిల్లాలను ఏర్పాటు చేయాలని స్పష్టంచేశారు. కొత్తగా ఏర్పడుతున్న జిల్లాలు అభివృద్ధి కేంద్రంగా ఉండాలన్నారు. మండలాల వ్యవస్థను సద్వినియోగం చేసేలా నిర్ణయాలుండాలన్నారు. అవసరమైతే కొత్త మండలాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జూన్‌లోగా ఆయా కలెక్టర్లు తమ పరిధిలోని శాసనసభ్యులు, మండలి సభ్యులు, ప్రజాప్రతినిధులతో అభిప్రాయ సేకరణ జరపాలన్నారు. అఖిలపక్షం అనంతరం తుది ముసాయిదాను ఖరారు చేస్తామని, ఆగస్టులో ప్రకటన జారీ అయిన నెలరోజులలో ప్రజాభిప్రాయాన్ని పూర్తి చేసి వినతుల్ని, అభ్యంతరాల్ని క్రోడీకరించి రెవిన్యూ ముఖ్యకార్యదర్శి సీసీఎల్ఏకు నివేదిక ఇస్తారని, దసరా నాటికి కొత్త జిల్లాల ఏర్పాటు జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాజధాని హైదరాబాద్ కూడా జిల్లాలయ్యే అవకాశముందంటున్నారు. కాగా, ఎక్కువ జిల్లాలను ఏర్పాటు చేయటం కొంతమేరకు వికేంద్రీకరణకు దోహదం చేసినా, మౌలికంగా పాలనావ్యవస్థలో మార్పు రాకుండా ప్రజల సమస్యలు పరిష్కారం కావని అనుభవాలు తెలియచేస్తున్నాయి. కలెక్టరేట్లు, కలెక్టర్ల వ్యవస్థను బలోపేతం దిశగా చేస్తున్న ఆలోచనలు కూడా వికేంద్రీకరణను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇప్పుడున్న ప్రధానమంత్రి–ముఖ్యమంత్రి–కలెక్టర్ (పీఎం–సీఎం–డీఎం)ల కేంద్రీకృత వ్యవస్థనే కొంత తేడాతో తెలంగాణ ముఖ్యమంత్రి కొనసాగించాలనుకుంటున్నారు తప్ప అధికారాన్ని జనం చేతికిచ్చేందుకు సుముఖంగా లేనట్టు కనిపిస్తోంది. స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయటంతోపాటు రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 8శాతాన్ని నేరుగా వార్డు స్థాయిలోకి ప్రతి పౌరుని పేరా కేటాయించి, పాలనకు జిల్లాను యూనిట్‌గా చేస్తే ఆ జిల్లా ప్రభుత్వాల వ్యవస్థ నుంచి నిజమైన మార్పు మొదలవుతుందని లోక్‌సత్తా తొలి నుంచీ స్పష్టంచేస్తోంది. ★

గత పది సంవత్సరాలుగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి

పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

# కాకతీయ విద్యా సంస్థలు

(నర్సరీ నుండి ఇంటర్ వరకు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ)

పెదనందిపాడు రోడ్ & సుబ్బయ్యతోట, చిలకలూరిపేట, ఫోన్ : 254610, 253510

రాష్ట్రస్థాయి ర్యాంకులైనా - నేడు గ్రేడులైనా కాకతీయదే అగ్రస్థానం

## 2016 S.S.C.లో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన మా విద్యార్థులు



2015 టాప్ ర్యాంక్
GPA
10/10
కొమ్మాలపాటి మణిశ్యాం
H.No.1514118154



నాగభైరు జీవనజ్యోతి
H.No. 1614119269

9.5 GPA



షేక్ అప్స
H.No. 1614118980



పఠాన్ జాన్ సైదా
9.3
H.No. 1614118878



షేక్ ఆయేషా
9.2
H.No. 1614119103



షేక్ మహమ్మద్
9.0
H.No. 1614118886



డిగల కీర్తి చందన
9.0
H.No. 1614119830



నాగిశెట్టి నీరజ
9.0
H.No. 1614119207



బొడపాటి రజని
9.0
H.No. 1614119826

**ఉత్తీర్ణత : A1 Grade 65, A2 Grade 12, B1 Grade 15, B2 Grade 8, C Grade 4**

* ఆడియో విజువల్స్ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు బోధన
* E- పవర్ వారి సిలబస్‌తో IIT బేస్‌డ్ ఎడ్యుకేషన్
* జూనియర్ ఇంటర్‌తోపాటు EAMCET, CA CPT శిక్షణ.
* ఇంటర్‌లో MPC, Bi.P.C., C.E.C., M.E.C. (EM/TM) గ్రూపులు కలవు.
* S.T., S.C.,.B.C.,మైనారిటీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు.
* గత 26 సం॥లుగా అత్యుత్తమ ఫలితాలను అందిస్తున్న అగ్రగామి విద్యాసంస్థ కాకతీయ.
* LKG INTER (EM & TM) అత్యుత్తమ విద్యాబోధన.

# రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలి
# అంతర్రాష్ట్ర మండలిలో ముఖ్యమంత్రుల ముక్తకంఠం

సుమారు పదేళ్ల విరామం తర్వాత అంతర్రాష్ట్ర మండలి పదకొండవ సమావేశం జులై 16న ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లోని సాంస్కృతిక మందిరంలో జరిగింది. రెండు సార్వత్రిక ఎన్నికల సమయం అనంతరం జరిగిన ఈ సమావేశంలో పలువురు ముఖ్యమంత్రులు.. కేంద్రం రాష్ట్రాల అధికారాలను లాగేసుకుంటోందని ప్రధానమంత్రి సమక్షంలో విమర్శించారు. చట్టాలు చేసేటప్పుడు, గవర్నర్ నియామకాల్లోనూ రాష్ట్రాలతో సంప్రదింపులు చేయాలన్నారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై రూపొందించిన పూంఛి కమిషన్ నివేదికను సమావేశం ఎజెండాలో భాగం చేసినప్పటికీ లోతైన చర్చ జరగలేదు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలని ముఖ్యమంత్రులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ముక్తకంఠంతో చెప్పారు. స్థూలంగా.. రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి కావాలన్న డిమాండ్ పెరగటం 11వ అంతర్రాష్ట్ర మండలి సమావేశం సారాంశంగా చెప్పవచ్చు.

సమావేశాన్నుద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర సంబంధాలతోపాటు విస్తృత ప్రజాబాహుళ్యానికి సంబంధించిన అంశాలపై చర్చలు జరపడానికి, విధానాల రూపకల్పన దశలోనే ఏకాభిప్రాయ సాధనకు అంతర్రాష్ట్ర మండలి సరైన వేదిక అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని అన్నారు. 21వ శతాబ్దం ఆర్థిక పరిస్థితులకనుగుణంగా యువతను నైపుణ్యవంతుల్ని చేయాలన్నారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సులను ఆమోదించటం వల్ల కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే వాటా 32 నుంచి 42శాతానికి పెరిగిందన్నారు. ఇది 2014-15 కంటే 21శాతం ఎక్కువన్నారు. 14వ ఆర్థిక సంఘం కాలవ్యవధిలో పంచాయతీ రాజ్, పట్టణ స్థానిక సంస్థలకు రూ.2.87 లక్షల కోట్లు (స్థానిక ప్రభుత్వాలకు ఈ కేటాయింపు ప్రధానంగా లోక్‌సత్తా కృషి వల్లే వచ్చింది. 14వ ఆర్థిక సంఘానికి లోక్‌సత్తా ఇచ్చిన ప్రతిపాదనల్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు. స్థానిక ప్రభుత్వాలకు రాష్ట్రాలకు బదిలీ చేసే నిధుల్లో 33శాతాన్ని నేరుగా స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వాల్సిందేనని లోక్‌సత్తా వాదించింది. అంటే, సుమారు 8లక్షల కోట్లు రావాల్సుంది. అయితే అంత విధానపరమైన నిర్ణయాన్ని తీసుకునే సాహసాన్ని చేయలేని 14వ ఆర్థిక సంఘం



### పూంఛి కమిషన్.. 7 ప్రధానాంశాలపై 273 సిఫార్సులు

కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై ఏర్పాటైన సర్కారియా కమిషన్ కాలావధి పూర్తయిన నేపథ్యంలో.. 2005లో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం పూంఛి నేతృత్వంలో రెండో కమిషన్ ఏర్పాటైంది. 2010లో ఈ కమిషన్ ఏడు ప్రధానాంశాలు.. 1)కేంద్ర-రాష్ట్ర సంబంధాల పరిణామక్రమం 2)ఆర్థిక సంబంధాలు 3)సామాజిక-ఆర్థిక అభివృద్ధి 4)అంతర్గత భద్రత 5)రాజ్యాంగబద్ధ పరిపాలన 6)స్థానిక స్వయంపాలన ప్రభుత్వాలు, పరిపాలన వికేంద్రీకరణ 7)పర్యావరణం, సహజ వనరులు, మౌలిక వసతులుపై.. 273 సిఫార్సులు చేసింది. 2006 తర్వాత అంతర్రాష్ట్ర మండలి సమావేశం జరగకపోవటంతో పూంఛి కమిషన్ నివేదికపై చర్చ జరగలేదు. పదేళ్ల యూపీయే పాలనలో రెండుసార్లే ఈ సమావేశాలు జరిగాయి. మోదీ ప్రభుత్వం మే 2014లో అంతర్రాష్ట్ర మండలిని పునర్వ్యవస్థీకరించింది. ఏడాదికాలంగా ప్రాంతీయ మండళ్లలో జరుగుతున్న సమావేశాలకు హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వం వహిస్తున్నారు.

## రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి కావాలన్న ముఖ్యమంత్రుల డిమాండ్ హేతుబద్ధమైనది: జేపీ

పదేళ్ల తర్వాత జులై 16న ఢిల్లీలో జరిగిన అంతర్రాష్ట్ర మండలి సమావేశంలో రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి కావాలని ప్రధానమంత్రిని ముఖ్యమంత్రులు చేసిన డిమాండ్ హేతుబద్ధమైనదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రజలకు అందించాల్సిన సేవల్లో అత్యధిక భాగం రాష్ట్రాల పరిధిలోనే ఉన్నాయన్నారు. ప్రజలు కూడా రాష్ట్ర ప్రభుత్వాలను చూసే ఓట్లు వేస్తున్నారని, సేవలందించటంలో విఫలమైతే అందుకు ఈ ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటోందని అన్నారు. అధికారం ఢిల్లీ చేతిలో కేంద్రీకృతం కావటం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు తాము ఎంత అనుకున్నా ప్రజలకు తగినంత స్థాయిలో సేవలు అందించే పరిస్థితి లేదన్నారు. అధికారాన్ని జవాబుదారీతనమున్న చోటికి బదిలీ చేయాలన్నారు. రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, పాలనా వ్యవస్థ ప్రక్షాళ, స్థానిక ప్రభుత్వాల పునర్నిర్మాణం, పాలనలో తెలిగ్గా మార్పులు చేసుకునే వెసులుబాటు అవసరమన్నారు. రాష్ట్రాల్లో, స్థానిక ప్రభుత్వాల్లో చేయాల్సిన పనులను ఢిల్లీ నుంచి ఆదేశిస్తుండటం వల్లే.. విద్యాహక్కు చట్టం, భూ సేకరణ చట్టం, ఉపాధి హామీ చట్టం, 73, 74వ రాజ్యాంగ సవరణలు అమలులో ఆశించిన ఫలితాలను సాధించలేక విఫలమవుతున్నాయన్నారు. పై నుంచి నామినేట్ అయిన గవర్నర్లు రాష్ట్రాల్లో రాజకీయ పెత్తనం చేస్తున్నారన్నారు. ఈ మొత్తాన్నీ సంస్కరించాల్సుందన్నారు. కేంద్రం రాష్ట్రాలకు బదిలీ చేసే నిధుల్లో 33శాతాన్ని నేరుగా స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయాలని, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, బలమైన స్థానిక ప్రభుత్వాలే భవిష్యత్తు ఫెడరలిజానికి కీలకమని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.



గణనీయంగానే అయినా కేవలం రూ. 2.87లక్షల కోట్లనే స్థానిక ప్రభుత్వాలకు కేటాయించింది. పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాలకంటే మనం వెనకబడటానికి స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు లేకపోవటం ఒక ప్రధాన కారణమని లోక్‌సత్తా తన పత్రంలో వివరించింది) కేటాయించిందని, ఇది అంతకుముందుతో పోలిస్తే చాలా ఎక్కువని అన్నారు. సహజ వనరుల వేలం ద్వారా వచ్చిన ఆదాయంలో కూడా రాబోయే కాలంలో రాష్ట్రాలకు రూ. 3.35లక్షల కోట్లు వస్తాయని (ప్రజా ఖజానాకు ఈ ఆదాయం కూడా లోక్‌సత్తా 2జీ స్పెక్ట్రం కేసులో సుప్రీంకోర్టులో చేసిన న్యాయపోరాటం, చేసిన వాదనలు, సూచించిన విధానాల ద్వారానే వచ్చింది) ప్రధాని తెలిపారు. పారదర్శకతకు, సుపరిపాలనకు ఆధార్ ఒక సాధనమని అందరూ అంగీకరించటం సంతోషకరమని అన్నారు. ఆధార్ అనుసంధానం వల్ల ఆదా అయ్యే వేలకోట్ల ప్రజాధనం అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. యువతే భారత్‌కున్న గొప్ప ఆస్తి అని, విద్యాప్రమాణాలు పెరగాలని అన్నారు. 30 కోట్ల మంది పిల్లలు బడికి వెళ్లాల్సిన వయసులో ఉన్నారన్నారు. విద్యలో నాణ్యతను పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలన్నారు. దేశ అంతర్గత భద్రతకు కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం చాలా అవసరమన్నారు. ప్రజల



భవిష్యత్తుకు భద్రత కల్పించటం ప్రభుత్వాల బాధ్యత కావాలన్నారు.

కేంద్ర, రాష్ట్రాలు క్రియాశీల తోడ్పాటుతో పనిచేయాలని, సమష్టిగా అభివృద్ధి విధానాలను రూపొందించుకోవాలని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశాభివృద్ధిలో రాష్ట్రాల పాత్ర ఉండాలని భావిస్తున్నందునే 14వ ఆర్థిక సంఘం సిఫార్సులకనుగుణంగా రాష్ట్రాలకు నిధులను పెంచామన్నారు.

**కేంద్రం రాష్ట్రాలను బలోపేతం చేయాలి: కేసీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి**

సహకార సమాఖ్య వ్యవస్థకు మద్దతిస్తున్నాం. రాష్ట్రాలను

బలోపేతం చేయాలి. ఒక సాగునీటి ప్రాజెక్టును ప్రతి రాష్ట్రంలో జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి. ఉమ్మడి జాబితాలోని అంశాలపై కేంద్రం చట్టాలు చేసే ముందు రాష్ట్రాల సమ్మతి తీసుకోవాలి. రాష్ట్రాలు నిరభ్యంతర పత్రం ఇచ్చేంతవరకు ఏఐసీటీఈ కళాశాలలకు అనుమతి ఇవ్వరాదు. గవర్నర్లను నియమించేటప్పుడు రాష్ట్రాలను కూడా సంప్రదించాలన్న సిఫార్సుకు మద్దతు పలుకుతున్నాం. రాష్ట్రాలు తమ వనరుల సమీకరణకు వీలుగా ఎఫ్ఆర్బీఎం పరిమితులను సడలించాలి. ఉపాధ్యాయులకు శిక్షణా ప్రమాణాలను ఎన్సీటీఈ ద్వారా మెరుగుపరచాలి. సాగునీరు, విద్య, ఆరోగ్య రంగాల్లో నిధుల్ని పుష్కలంగా పెంచాలి. పోలీసు యంత్రాంగాన్ని ఆధునీకరణకు నిధులు కేటాయించాలి. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలను బలోపేతం చేయాలి. తీవ్రవాద ధోరణుల్ని అదుపు చేయటానికి వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులివ్వాలి. న్యాయవ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలి. అంతర్రాష్ట్ర మండలిని బలోపేతం చేయాలి.

**రాష్ట్రాల అనుమతి ముఖ్యం: చంద్రబాబు నాయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి**

పారామిలిటరీ దళాల తరలింపు సహా రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై సంబంధిత రాష్ట్రం/రాష్ట్రాల అనుమతితోనే కేంద్రం చర్యలు ప్రారంభించాలి. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన తీరే ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా జరిగింది. పూంఛి కమిషన్ నివేదికలోని కొన్ని అంశాలను స్వాగతిస్తున్నాం, కొన్నిటిని సరిదిద్దాల్సుంది. రాష్ట్రాల మధ్య వివాదాలను పరిష్కరించే అధికారాన్ని అంతర్రాష్ట్ర మండలికి ఇవ్వాలన్న సూచనకు మద్దతిస్తున్నాం. జలవివాద ట్రైబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు పరిశీలించాలన్న సూచన ఆమోదయోగ్యం కాదు. ఇప్పటికే సుప్రీంకోర్టు మీద పనిభారం ఎక్కువగా ఉంది. దానిబదులు అప్పిలేట్ ట్రైబ్యునళ్లు ఏర్పాటు చేయవచ్చు. రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సాధికార కమిటీ పని తీరు చూశాక.. అదే తరహాలో మిగతా రంగాల్లో కూడా సాధికార కమిటీలు వేయాలన్న ఆలోచన సరికాదు. ఏపీలో గ్రేహౌండ్ శిక్షణా కేంద్రం, పోలీసు అకాడమీ లాంటి సంస్థల ఏర్పాటుకు కేంద్రం సాయం అందించాలి.

**గవర్నర్ పదవి రద్దు చేయాలి: నితీష్ కుమార్, బీహార్ ముఖ్యమంత్రి**

ప్రస్తుత సమాఖ్య వ్యవస్థలో గవర్నర్ పదవి అక్కర్లేదు. ఒకవేళ ఆ పదవిని రద్దుచేయడం కుదరకపోతే, విచక్షణాధికారాలకు కత్తెర వేయాలి. ఆ నియామకాలకు సంబంధించిన నిబంధనలను స్పష్టంగా పేర్కొనాలి. పారదర్శకతనూ పెంచాలి. సర్కారియా కమిషన్ సూచనల ప్రకారం.. గవర్నర్ని నియమించటంలో ముఖ్యమంత్రిని తప్పనిసరిగా సంప్రదించాలి.

**రాష్ట్రాలకు మరిన్ని అధికారాలివ్వండి: జయలలిత, తమిళనాడు ముఖ్యమంత్రి**

శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలకు నిత్యావసరాలు, మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వాలు సత్తాను నిరూపించుకుంటున్నాయి. మెరుగైన సేవలు కల్పిస్తున్నాయి. కానీ దశాబ్దాలుగా అధికారాలన్నీ జాతీయస్థాయి ప్రభుత్వం వద్దే కేంద్రీకృతమవుతున్నాయి. ఇప్పుడు చక్రం వెనక్కి తిరగాల్సిన సమయం వచ్చింది. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కల్పించాలి. గవర్నర్ల పదవీకాలాన్ని ఖరారు చేయాలంటున్న పూంఛి కమిషన్ సూచనపై తొందరపడి నిర్ణయం తీసుకోవద్దు. కావేరీ నదీ జలాల నిర్వహణ బోర్డు (సీఎంబీ), కావేరీ నదీ జలాల నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయండి.

**మెజారిటీ లేకుంటేనే రాష్ట్రపతి పాలన: అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి**

రాష్ట్ర ప్రభుత్వానికి అసెంబ్లీలో ఆధిక్యం లేకపోతేనే రాష్ట్రపతి పాలన విధించాలి. రైతు రుణాలను మాఫీ చేయాలి.

**స్వయంప్రతిపత్తి కావాలి: జి. పరమేశ్వరన్, కర్ణాటక హోం మంత్రి**

రాజ్యాంగంలోని 'రాష్ట్రాల జాబితా'లో పొందుపరిచిన అంశాలకు సంబంధించి రాష్ట్రాలకు మరింత స్వయంప్రతిపత్తి కావాలి. వాటిపై పార్లమెంటు ఆధిపత్యాన్ని గణనీయంగా తగ్గించాలి.

**ఉగ్రవాదంపై పోరు విధానాన్ని సిద్ధం చేయాలి: రమణ్ సింగ్, ఛత్తీస్గఢ్ ముఖ్యమంత్రి**

ఉగ్రవాద ముప్పును ఎదుర్కొనేందుకు జాతీయ ఉగ్రవాద పోరాట విధానాన్ని సిద్ధం చేయాలి. సైబర్ నేరాలకు సంబంధించి ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలి.

**రాష్ట్రాలకు ఇంకా వనరులు కావాలి: మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి**


14వ ఆర్థిక సంఘం సిఫార్సులతో రాష్ట్రాలకు ఆర్థిక వనరులు తగ్గాయి. రాష్ట్రాలకు మరిన్ని వనరులు, అధికారాలు కావాలి. మండలి స్థాయీ సంఘాల్లో తమకు అనుకూలమైన ముఖ్యమంత్రులనే కేంద్రం సభ్యులుగా నియమించుకుంటోంది.

# రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి సమయం ఆసన్నం

- కూసంపూడి శ్రీనివాస్

ఏపీ అధికార ప్రతినిధి, లోక్‌సత్తా పార్టీ

అధికారం ఢిల్లీ చేతిలో కేంద్రీకృతం కావడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు తమను ఎన్నుకున్న ప్రజలకు తగినంత స్థాయిలో సేవలు అందించే పరిస్థితి లేదనేది ఒక వాస్తవం. ఈ కారణంగా రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి కావాలంటూ వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇటీవల (జులై 16) ఢిల్లీలో జరిగిన 11వ అంతర్రాష్ట్ర మండలి సమావేశంలో కేంద్రాన్ని చేసిన డిమాండ్ నిజంగా హేతుబద్ధమైనది. స్వయంప్రతిపత్తి వలన భిన్న భాషా జాతులు గల భారత రాష్ట్రాలు ఎక్కువ గుర్తింపు పొందుతాయి. మొత్తం ఉత్తర భారత హిందీ దృక్కోణంలో పరిగణించ కుండా ఎక్కడైతే స్థానిక సంప్రదాయాలు, సంస్కృతి, చరిత్రలను ఆయా రాష్ట్రాల నేపథ్యంలో చెప్పుకుంటారో అక్కడ ప్రజలకు ఎక్కువ మేలు జరుగుతుంది. జాతిపరమైన గుర్తింపును మరింత సానుకూలతతో సంరక్షించు కోవచ్చు. రాష్ట్రాల్లో, స్థానిక ప్రభుత్వాల్లో చేయాల్సిన పనులను ఢిల్లీ నుంచి ఆదేశిస్తుండటం వలనే విద్యాహక్కు చట్టం, భూ సేకరణ చట్టం, ఉపాధి హామీ చట్టం, 73,74 రాజ్యాంగ సవరణలు అమలులో ఆశించిన ఫలితాలను సాధించలేక విఫలమైన సంగతి అందరికీ తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల నుంచి పన్నులు వసూలు చేస్తుంది. ఆర్థిక విధానాలను నిర్ణయిస్తుంది. అయితే వసూలు చేసిన సొమ్మును ఏ ప్రామాణికాల ఆధారంగా రాష్ట్రాలకు పంపిణీ చేస్తుందో తెలీదు. ఇక్కడ అవినీతి, పక్షపాతాలు ఉంటాయి. ఢిల్లీ నాయకుల మెప్పు కోసం ప్రాంతీయ రాజకీయ నాయకులు నానా అగచాట్లు పడతారు. అలా చేస్తేగానీ వారు తమ రాష్ట్రాలకు నిధులు తెచ్చుకోలేని దౌర్భాగ్య పరిస్థితి.




1994 సంవత్సరానికి ముందు రెండు దశాబ్దాలపాటు కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు 22శాతం వద్ద నిలిచిపోయింది. కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక సంఘాల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యాల కారణంగా రాష్ట్రాల్ని పెద్ద మునిసిపాలిటీలుగా మార్చేశారు. కేంద్రం పెద్ద మొత్తంలో పన్నులు వసూలు చేయడం, సహజ వనరులపై అజమాయిషీ తీసుకోవడం, కొన్ని ప్రత్యేక వ్యాపార సంస్థలకు లాభాలు చేకూర్చడంతో రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడిపోయాయి. కేంద్ర ప్రభుత్వ కేంద్రీకృత ఆర్థిక విధానాలపై సందర్భం వచ్చిన ప్రతిసారీ రాష్ట్రాలు నిలదీస్తూనే ఉన్నాయి. దీనికి సర్దుబాటుగా 14వ ఆర్థిక సంఘం సిఫార్సులను కేంద్రం ఆమోదించిందని కొందరు నిపుణులు అభిప్రాయపడ్డారు. నిజానికి దేశ జీడీపీ రేటును ఉరకలెత్తించగల సత్తా ఉన్న రాష్ట్రాలకు కేంద్ర విధానాలు సంకెళ్లుగా మారుతున్నాయి. దేశ ఆర్థికరంగంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలకు మధ్య అసమతౌల్యం ఉంది. ఉదాహరణకు 2011-13 మధ్య రెండేళ్ల

కాలంలో కర్ణాటక నుంచి రూ.16వేల కోట్లు, తమిళనాడు నుంచి 16వేల కోట్లు, ఆంధ్రప్రదేశ్ నుంచి 11వేల కోట్లు సర్వీస్ ట్యాక్స్ కింద కేంద్ర ఖజానాకు చేరాయి. ఇదే రెండేళ్ల కాలంలో రాజస్తాన్ నుంచి రూ.2500కోట్లు, యూపీ నుంచి 4200 కోట్లు, బీహార్ నుంచి 500కోట్లు సమకూరాయి. అయితే.. పన్నుల వసూళ్లను బట్టి కాకుండా జాతీయస్థాయి ప్రజాతంత్ర ప్రభుత్వంగా అన్ని భౌగోళిక ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందేట్టుగా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంటుంది. ఈ నేపథ్యంలోనే, ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు పంచే పన్నుల రాబడులు, గ్రాంటులు, ఇతర ఆర్థిక సహాయాల విషయంలో వెనుకబడిన, పేద రాష్ట్రాల పట్ల ఎక్కువ ప్రేమ కనిపించడం సహజమే. మిశ్రమ ఆర్థిక వ్యవస్థ కొనసాగినంత కాలం అసంతృప్తి ఉన్నా, ఈ విధానాన్ని ఎవరూ తప్పు పట్టలేదు. కానీ, అదేసమయంలో భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరడానికి అవరోధంగా ఉన్న బీమారు రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్యాన్ని చక్కదిద్దే ఆచరణాత్మక ప్రయత్నమేదీ కేంద్రప్రభుత్వం చేయకపోవడం క్షమార్హం కాదు.

నీతి ఆయోగ్ తొలి భేటీలో ప్రధాని మోదీ రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కట్టబెట్టి, నిధుల వినియోగంలో స్వేచ్ఛనిస్తేనే దేశం శక్తిమంతమవుతుందని, వృద్ధి బాటన సాగుతుందని అందుకే 14వ ఆర్థికసంఘం సిఫార్సుల మేరకు కేంద్ర పన్నుల వాటాల్లో రాష్ట్రాలకు 42శాతం నిధులిస్తున్నామని ప్రకటించారు. అయితే ఇదే సందర్భంలో ఒక చేత్తో ఇచ్చి మరొక చేత్తో లాక్కునే చందంగా ఏకంగా 12 కేంద్ర ప్రాయోజిత పథకాలకు భారీ కోత పెట్టారు. ఆయా కేంద్ర పథకాలకు 2015–16 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కేటాయింపులనే భారీగా తగ్గించేసింది కేంద్రం. ఈ–గవర్నెన్స్, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, పోలీసు బృందాల ఆధునీకరణ, మోడల్ స్కూల్స్, పర్యాటక రంగ అభివృద్ధి, పంచాయతీల అభివృద్ధి వంటి పథకాలకు కేంద్రం నిధులు విడుదల చేయదు. ఈ పథకాలను కొనసాగించేందుకు రాష్ట్రాలే నిధులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. లేదా వాటిని రద్దు చేసుకోవచ్చు. 35 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్రం, రాష్ట్రాల వాటాల్లో మార్పులు చేశారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వాలపై గతం కన్నా ఎక్కువ భారం పడనుంది. ఈ పథకాలను తగ్గించినా నష్టంలేని పాలన అందించగల రాజకీయం ఇంకా మనకు లేదు. అది వేరే చర్చ.

ఇవన్నీ ఒక ఎత్తయితే, హేతుబద్ధంగా జరగని రాష్ట్ర విభజన వలన ఆంధ్రప్రదేశ్‌కి ఆర్థిక కష్టాలు వెన్నంటుతూనే ఉన్నాయి. ప్రత్యేక హోదా, నిధులు కల్పిస్తే తప్ప మిగతా రాష్ట్రాలతో పోటీపడలేని పరిస్థితి. రాజధాని కూడా లేని ఏపీ అభివృద్ధికి ఆర్థిక, మౌలిక సదుపాయాలు కల్పించాలని, విభజన హామీలు నెరవేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని పదేపదే వేడుకుంటున్నారు. కేంద్రం మాత్రం కరుణించటం లేదు. అమరావతి చుట్టూ కేంద్రీకృత అభివృద్ధిలో భాగంగా రహస్య అవగాహనలుండటం, ఓటుకు కోట్లు కేసు వల్లే చంద్రబాబు తన రాజకీయ స్వార్థం కోసం ఏపీ ప్రయోజనాలను ఢిల్లీలో ఫణంగా పెడుతున్నారన్న వాదనలూ కొట్టిపారేయలేనివి. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు లోక్‌సత్తా చొరవ వల్ల వచ్చిన ప్రత్యేక హోదా ప్రతిపాదన సాకారమవటం ఇప్పుడు కావాలి. ఏపీలో ఇప్పుడు ప్రత్యేక హోదాతో పాటు స్వయంప్రతిపత్తి దిశగా కూడా ఉద్యమాలు జరుగుతున్నాయి. కాశ్మీర్ సహా దేశంలోని అన్ని రాష్ట్రాలకూ దేశ సమగ్రత, జాతీయ భద్రత పరిధిలో స్వయంప్రతిపత్తి ఉండాలని, స్థానిక ప్రభుత్వాలకు కేంద్రం నుంచి వచ్చే నిధుల్లో 33శాతాన్ని (రూ. 8–10లక్షల కోట్లు) కేటాయించాలని, ముఖ్యమంత్రులకు ప్రత్యక్ష ఎన్నికలు జరిపి రాష్ట్రాల్లో ఫిరాయింపుల సంస్కృతికి మంగళం పాడాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రతిపాదించిన సంస్కరణల్ని అమలుచేయటమే ఇప్పుడు పరిష్కారం.


అభివృద్ధిలో వెనకబడిన రాష్ట్రాలకు నిర్మాణాత్మక కార్యాచరణ ఇవ్వకపోవడం, పోటీపడి దూసుకుపోయేందుకు అవకాశం ఉన్న రాష్ట్రాలకు వనరులను అందుబాటులో ఉంచకపోవడం వివాదాస్పదంగా మారుతుంది. పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమలకు ప్రోత్సాహం, ఉపాధి కల్పనకు చేయూత, నైపుణ్యాల పెంపు, మేక్ ఇన్ ఇండియా ఉద్యమం.. అంటూ ఊదరగొడుతున్న కేంద్రప్రభుత్వం లక్ష్యానికి చేరుకునే దారులను తానే మూసేస్తోంది. ఇది ఇలానే కొనసాగడం దేశ భవిష్యత్తుకి మంచిది కాదు. జేపీ ప్రతిపాదించినట్టు.. దేశ భద్రత, కరెన్సీ, విదేశీ వ్యవహారాలు, అంతర్రాష్ట్ర వివాదాల పరిష్కారం లాంటి జాతీయస్థాయి వ్యవహారాలు కేంద్రపరిధిలో ఉంచుకుని, రాష్ట్రాలకు అధికారాలివ్వాలి. కేంద్రం నుంచి బదిలీ చేసే నిధుల్లో మూడోవంతును నేరుగా స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయాలి. ముఖ్యమంత్రులను ప్రత్యక్షంగా ఎన్నుకునేందుకు రాజ్యాంగ సవరణ చేయాలి. బలమైన స్థానిక ప్రభుత్వాలే పటిష్ట ఫెడరలిజానికి కీలకం కాబట్టి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆ ప్రయత్నం చేయాలి. అలా చేస్తే ప్రస్తుతం దేశంలో నెలకొన్న అనేక సమస్యలకు పరిష్కారం లభించినట్టే. అలా జరిగిననాడు మాత్రమే భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదగగలుగుతుంది. ★

# కాశ్మీర్ రాజకీయ శూన్యత-మోదీ ప్రభుత్వ ఆలోచనా శూన్యత

**2014** డిసెంబర్‌లో వెలువడిన జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మూడు ప్రాంతాలవారీగా, మతాలవారీగా చీలిపోయినా ప్రజలు తమ అభివృద్ధికి, విద్య, ఆరోగ్య, ఉపాధి అవకాశాలు ఓటు వేశారనటంలో సందేహం లేదు. ఉగ్రవాదం, అవినీతి, హింస, అస్థిరతల నుంచి బైటపడి ప్రజాస్వామ్య యుతంగా ఎదగాలన్న ఆకాంక్షతో ప్రజలు పెద్దఎత్తున ఓటును వినియోగించుకున్నారు. ఆ ఎన్నికల్లో గణనీయ సీట్లు సాధించిన బీజేపీకి ప్రభుత్వంలో భాగస్వామిగా మారే అవకాశం రావటం చరిత్ర గతిని మార్చే అవకాశమని ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అభినందన సందేశంలో అన్నారు. లోక్‌సత్తాతోపాటు పలువురు ప్రజాస్వామ్యవాదులు కూడా ఎంతో ఆశపడ్డారు. కానీ రెండేళ్లు గడవక ముందే ఆశలు సన్నగిల్లుతున్నాయి. మళ్లీ హింస పెరుగుతోంది. సరిహద్దుల ఆవలి శక్తుల ద్వారా కన్నా దేశంలోపలి రాజకీయాలు, కాశ్మీర్‌లో పరిణామాలే ఈసారి హింసకు ఆజ్యం పోస్తున్నాయి.

కాశ్మీర్ సమస్యకు కాంగ్రెస్ ప్రధాన కారణమనటంలో సందేహం లేదు. కానీ దాన్ని సమూలంగా పరిష్కరించుకునే అవకాశాన్ని బీజేపీ జారవిడుచుకుంటుండటం విషాదకరం. కేవలం అధికారమే లక్ష్యంగా వ్యవహరిస్తుండటం వల్ల, ఎలాగోలా వచ్చిన ఓట్లు, సీట్లు చూసి మురిసిపోతుండటం వల్ల అసలు లక్ష్యం చేజారిపోతోంది. కాశ్మీర్ ముఖ్యమంత్రిగా ఎన్నికైనా ముఫ్తీ మహ్మద్ సయీద్ మృతి వల్ల రాజకీయ శూన్యత ఏర్పడుతుందని, అందువల్ల ఆయన కుమార్తె మెహబూబాను ముఖ్యమంత్రిని చేయటమే సమస్యకు పరిష్కారమార్గమని వంశపారంపర్య రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించే లోక్‌సత్తా కూడా 2016లో సూచించింది. కానీ ఎత్తులుజిత్తులతో తీవ్ర జాప్యం అనంతరం ఎట్టకేలకు ఆమె ముఖ్యమంత్రి అయ్యారు. కేంద్రంలో కూడా అధికారంలో ఉన్న పార్టీగా మెహబూబా కంటే కూడా పరిణతితో వ్యవహరించటం తన బాధ్యతని బీజేపీ గుర్తించలేదు. కాశ్మీర్, పంజాబ్, ఈశాన్య రాష్ట్రాలలో చాలా యధాలాపంగా వ్యవహరించే బీజేపీ వ్యవహారశైలి కాశ్మీర్ సమస్యను మళ్లీ రగులుస్తోంది.

ఇటీవల బీజేపీ అధికార ప్రతినిధొకరు టీవీ ఛానల్లో మాట్లాడుతూ, ఉదార రాజకీయాల వల్లే కాశ్మీర్ సమస్య ఇంకా కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. ఉదార రాజకీయాలంటే ఉగ్రవాదులు భయపడినట్లు బీజేపీ భయపడటం ఆశ్చర్యం కలిగిస్తుంది. నిజానికి బీజేపీ, అంతకుముందు కాంగ్రెస్ సక్రమంగా వ్యవహరించి ఉంటే కాశ్మీర్‌లో ఉదార రాజకీయాలు పాతుకుపోయి ఉగ్రవాదులు ఎన్ని విన్యాసాలు చేసినా ప్రజల్లో



స్పందన ఉండేది కాదు. కానీ మోదీ ప్రభుత్వం తెలిసోతెలియకో అనుసరిస్తున్న 'నో క్రియేటివిటీ-ఓన్లీ మేనేజ్‌మెంట్' రాజకీయాల వల్ల ఆయనకు సమస్యలు అంతుచిక్కక నిజాయతీగా కష్టపడుతున్నా ఫలితాలు రావటం లేదు. కాశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగంగా గొప్పగా చూడాలని ఆయన మనసులో, బీజేపీవారి గుండెల్లో ఉండవచ్చు. కానీ కేవలం ఆకాంక్షలతో చట్టాలు, పరిపాలన చేస్తే ఫలితాలు రావు. కాశ్మీర్ విషయంలో పరస్పర విరుద్ధ ప్రయోజనాలను ఒడుపుగా సమన్వయం చేస్తూ ఉమ్మడి లక్ష్యం వైపు నడించాల్సుంటుంది. ఈ క్రమంలో సృజనాత్మకతను స్తంభింపచేయటం, కొత్త పోకడులన్నవారిని దగ్గరకు రానీయకపోవటం వల్ల.. పనికొచ్చే ఐడియాలు లేకుండా పోయి కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. సృజనాత్మకను అణచివేయటాన్ని రాచరికం, నియంతృత్వం అంటారుగానీ అణచివేతకు, స్తంభింపచేయటానికి పెద్ద తేడా ఏమీ ఉండదు.

జమ్మూకాశ్మీర్‌లో దశాబ్దాలుగా ఫెడరలిజం పట్ల ఆకాంక్షలు, ఇటీవలికాలంలో పాకిస్తాన్ హింసాత్మక, ఛాందస భావాల పట్ల పెరుగుతున్న వ్యతిరేకత, జనాభాలో డెబ్బైశాతానికి పైగా ఉన్న యువతలో ఉపాధి పట్ల ఆశలు.. ఇవన్నీ సంక్షోభాన్ని పరిష్కరించటానికి బీజేపీకి అందివచ్చిన అవకాశాలే. వీటిని వినియోగించుకుని కాశ్మీర్‌లోయలో తన పట్ల ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మలచుకోవాల్సింది పోయి ఇంకాఇంకా చీలికలు తెచ్చి లబ్ధి పొందే ప్రయత్నం చేయటం ఆ పార్టీకే కాదు, దేశ ప్రయోజనాలకు కూడా దీర్ఘకాలంలో ప్రమాదకరం. యువ మిలిటెంట్ బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్‌తో కాశ్మీర్‌లో తాజా కల్లోలం, హింస మొదలైన తరుణంలోనే సుప్రీంకోర్టు మణిపూర్ నేపథ్యంలో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ)ని తూర్పారపట్టింది. విదేశాల మీద యుద్ధం చేస్తున్నట్టు భారతీయ పౌరుల మీద ఇలాంటి చట్టాలను అమలు చేస్తారా? అని ప్రభుత్వాన్ని నిలదీసింది. ఇది కాశ్మీర్‌లో ప్రభుత్వం అనుసరిస్తున్న శాంతిభద్రతల వ్యూహానికి కూడా చెంపపెట్టు.

బుర్హాన్ ఎన్‌కౌంటర్ దరిమిలా మొదలైన ఉద్రిక్తతలు త్వరలో సమసిపోవచ్చు. కానీ కాశ్మీర్ నివురుగప్పిన నిప్పులా తయారై రాజుకుంటోందని మాత్రం ప్రభుత్వం గుర్తించాలి. తెర వెనక పాక్ కేంద్రంగా కొన్ని శక్తులు ఫండింగ్ చేస్తుండొచ్చుగానీ.. ఇప్పుడు కాశ్మీర్‌కు బైట ఎక్కడి నుంచో ఉగ్రవాదులు దిగుమతి కానక్కర్లా, రాష్ట్రంలోనే సోషల్ మీడియా ద్వారా నిరుద్యోగ యువత తీవ్రవాద భావాల వైపు మళ్లుతున్నారు. అందుకే బీజేపీ మేనేజ్‌మెంట్ రాజకీయాలను దాటి ఆలోచించాలి. నిర్మాణాత్మక సృజనశీల ఆలోచనలతో పరిష్కారాలను చేపట్టాలి. మిగిలిన దేశం కంటే భిన్నమైన సమస్యలు కాశ్మీర్‌కి మౌలికంగా లేకపోయినా, ఇక్కడున్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా వాటి పరిష్కారాన్ని వేగవంతం చేయాలి.

ముందుగా యువతకు ఉపాధిని పెంచటానికి భారీఎత్తున చర్యలు చేపట్టాలి. ఇందుకు శాంతిభద్రతల సమస్య అవరోధం కాకుండా స్థానిక మిలిటెంట్ గ్రూపులు సహా కాస్త ప్రభావం చూపగలవారందరినీ ఆహ్వానించాలి. ఈ పని 2014లో ప్రభుత్వం ఏర్పడగానే మొదలుపెట్టి వుంటే మళ్లీ పరిస్థితులు దిగజారటం ఉండేది కాదు. పరిష్కారంలో వీలైనంత ఎక్కువమందిని భాగస్వాముల్ని చేస్తూనే అన్ని ప్రాంతాల ప్రజల మధ్య సామరస్యతను పెంచటాన్ని అత్యంత ప్రాధాన్యాంశంగా బీజేపీ భావించాలి. ఎన్నికల్లో ప్రాంతాలవారీగా, మతాలవారీగా చీలిపోయిన జమ్మూకాశ్మీర్‌లో సమన్వయాన్ని, ఐక్యతను సాధించటం, విద్వేషాల్ని తొలగించటం, అవినీతిని అంతమొందించి అభివృద్ధిని చేపట్టటం, గాయపడ్డ ప్రజలకు అండగా నిలవటం ఇప్పుడు కేంద్రం అండదండలతో రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పని. బీజేపీ–పీడీపీ (పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ) ఉమ్మడి ఎజెండా కూడా ఇదే అంశాల చుట్టూ ఉంది. కానీ అమలు చేయకుండా పక్కనపడేశారు. మరోవైపు ద్వేషభావజాల వ్యాప్తిని సమర్థవంతంగా ఎదుర్కోవాలి. కాశ్మీర్‌లో వినోదవికాస సాధనాలు లేకుండా సోషల్ మీడియా ప్రభావమే ఉండటంతో ఆ అపరిపక్వ ఆలోచనలు, భావోద్రేకాలు ఉపాధి లేని యువత మీద తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇస్లాంను వక్రీకరించి వహాబిస్టు హింసను అసలైన ఇస్లాంగా ప్రచారం చేస్తున్న ఐసిస్ వంటి తీవ్రవాద శక్తుల ప్రభావం యువత మీద ఉండటానికి సోషల్ మీడియా పెద్ద కారణంగానే ఉంది.

కొందరు చదువుకున్నవారు, సంపన్న యువత కూడా మత ఉగ్రవాద శక్తులవైపు ఆకర్షితులు కావటానికి, ఇంట్లో పెద్దలు కూడా మద్దతివ్వటానికి ఇస్లాంపై అవగాహన లేకపోవటం ప్రధాన కారణం. ముస్లింలలోని కొంతమంది విద్యావంతుల్లో మార్కెట్ చదువులు తప్ప మతం గురించి స్పష్టత లేకపోవటం, మెజారిటీ ముస్లింలకు ఏరకమైన చదువులు, సరైన ఉపాధి లేకపోవటం, రాజకీయ అవసరాల కోసం ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టటం, ప్రపంచవ్యాప్తంగా పరిణామాలు కాశ్మీర్‌లోనే కాకుండా మనదేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా తీవ్రవాద భావాల పట్ల యువతను ఆకర్షితులను చేస్తోంది. ఈ నేపథ్యంలో.. నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి అందించటం, పోలీసు, న్యాయవ్యవస్థల పట్ల విశ్వసనీయతను పెంచే సంస్కరణలను తేవటంతోపాటు నిజమైన ఇస్లాం అంటే ఏమిటో కూడా ప్రచారం చేయటం అవసరం. ఇటీవల రంజాన్ మాసంలోను, ముగిశాక కూడా ఈద్ రేపొ, ఎల్లుండా అనే సాంకేతికపరమైన అంశాలకు తప్ప ఉగ్రవాదం నుంచి నిజమైన ఇస్లాంను వేరు చేసే వాస్తవాలను పంచే ప్రయత్నాన్ని పాలకులు, పౌరసమాజం, మీడియా చేయకపోవటం దురదృష్టకరం. ఇస్లాంను వక్రీకరించి హింసను జోడించి తయారుచేసిన వహాబిజాన్ని క్రీశ 1744లో రాజకీయ స్వార్థం కోసం సౌదీ అరేబియా నాయకులు ప్రోత్సహించారు. ఆ దేశానికి చమురు ఇంధనంతో వచ్చిన లెక్కలేని ఆదాయం వహాబిజాన్ని విస్తరించటానికి దోహదం చేసింది. ఈజిప్టులోని వక్ర మేధావులు ఆలోచనా సహకారం తోడైంది. ఇంతచేసినా పరిమితంగానే విస్తరించిన వహాబిజం ఈవేళున్న సమాచారసాంకేతిక వ్యవస్థతో ప్రపంచాన్ని వణికిస్తోంది. ఇస్లాం వేరు, హింసాత్మక వహాబిజం వేరు అని ఈ వాస్తవాలను పెద్దఎత్తున ప్రపంచం ప్రచారం చేయాలి, ఇస్లాం నుంచి అనేక గళాల్ని ఇందుకోసం ప్రోత్సహించాలి. కాశ్మీర్ నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రయత్నాన్ని ప్రారంభించాలి.

ఉపాధి, నిజమైన ఇస్లాంపై చైతన్యంతోపాటు ప్రజలలో ఉన్న స్వతంత్ర ప్రతిపత్తి ఆకాంక్షను కూడా ప్రభుత్వం పట్టించుకోవాలి. కాంగ్రెస్ చేసిన తప్పిదాల వల్ల ఇది భారత్ నుంచి విడిపోవాలనే స్థాయిలో ఉన్నా.. మీపై కేంద్రం పెత్తనం చేయబోదు అనే భరోసాతో ప్రభుత్వం ప్రజలలో విశ్వసనీయతను పెంచుకునే ప్రయత్నం చేయాలి. వాస్తవానికి కేంద్రంపై అసంతృప్తి కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో ఉన్నంత తీవ్రంగా లేకపోయినా పంజాబ్, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో పెరుగుతోంది. దీన్ని ఇప్పుడే సరిదిద్దకపోతే ఎన్ని ఎన్నికల్లో గెలిచినా ఎవరూ భారతదేశాన్ని కాపాడలేరు. కాబట్టి దేశవ్యాప్తంగా రాష్ట్రాలకు స్థానిక ప్రభుత్వాల సాధికారతతో స్వయంప్రతిపత్తిని కల్పించేందుకు కాశ్మీర్ సంక్షోభాన్ని ఒక అవకాశంగా కేంద్రప్రభుత్వం వినియోగించుకోవాలి. దీనివల్ల కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిజమైన ఫెడరల్ ఇండియా ఏర్పడి దేశ సుస్థిరాభివృద్ధికి దోహదం చేసే అవకాశముంది. భారత్ ఇల్లుచక్కదిద్దుకోకుంటే ఐసిస్ సహా బయట వేచి చూస్తున్న అనేక శక్తులు కాశ్మీర్ సహా అనేక ద్వారాల గుండా ప్రవేశిస్తాయి. ఇప్పటికే ఆలస్యమైంది. టీవీ ఛానళ్లకు, సోషల్ మీడియాకు, మేనేజ్‌మెంట్ పాలిటిక్స్‌కు మాత్రమే పరిమితం కాకుండా నిర్మాణాత్మకమైన, చారిత్రక దృష్టి ఉన్న సృజనాత్మక ఆలోచలను చర్చించి అమలుచేయటమే మోదీ ప్రభుత్వం ముందున్న సరైన పథం. ★

# ఎన్నికల అనంతర వ్యూహమే కాశ్మీర్‌లో శాంతికి కీలకం

- డా॥ జయప్రకాష్ నారాయణ్



జమ్ము-కాశ్మీర్‌లో రెండు విడతల ఎన్నికలు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 45శాతం ఓట్లు పోల్ కావటంతో ఎన్నికల అనంతరం శాంతి పునరుద్ధరణకు సమస్య పరిష్కారానికి అవకాశాలున్నాయనే ఆశ మరోసారి చిగురిస్తోంది. మూడో విడత ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రస్తుత అంచనాల ప్రకారం 40శాతానికిపైగా ఓట్లు పడే అవకాశం ఉంది. 1983 తరువాత సక్రమంగా జరిగిన మొదటి ఎన్నికలు ఇవి. ఈసారి ఎన్నికలలో గతంలో ఎప్పుడూ లేనంతగా ఎలక్షన్ కమిషన్ అసాధారణ చర్యలు తీసుకుంది. రాష్ట్రంలో అధికారపక్షమైన నేషనల్ కాన్ఫరెన్స్ పాలనాయంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడే అవకాశం లేకుండా ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. అలాగే లంగిపోయిన మాజీ ఉగ్రవాదులందరినీ ఎన్నికలయ్యేదాకా నిర్బంధంలోకి తీసుకోవాలని, వారెవరూ పాలకపక్షంతో కుమ్మక్కయి ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశం ఉండరాదని ఎన్నికల సంఘం ఆదేశించింది. మనరాష్ట్రంలో లంగిపోయిన నక్సలైట్లు కొందరు పోలీసు అధికారులతో లాలూచీపడి అక్రమార్జనకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. జమ్ము-కాశ్మీర్‌లో కూడా అలాంటి పరిస్థితే ఉన్న కారణంగా ఈ చర్య తీసుకున్నారు. ఈ రెండు నిర్ణయాలు ప్రపంచ ప్రజాస్వామ్య చరిత్రలో అసాధారణమయినవి. మనదేశంలో ఎన్నికల సంఘం ఎంత బలంగా, స్వేచ్ఛగా, స్వతంత్రంగా వ్యవహరిస్తోందో చెప్పటానికి ఈ రెండూ ప్రబల సాక్ష్యాలు.



### ఇల్లలకగానే పండగ కాదు

ప్రస్తుత పరిస్థితుల్లో ఇంత పెద్దఎత్తున ఓటింగ్ జరగటం ఓ అసాధారణ విజయం. చాలాకాలంగా కాశ్మీర్‌లో ప్రజలు ఉగ్రవాదులకి, భద్రతాదళాలకు మధ్య నలిగిపోయారు. చిరకాలంగా కొనసాగిన దుష్పరిపాలన, ఎన్నికల అక్రమాలు, అనునిత్యం చూస్తున్న రక్తపాతం, అనుభవిస్తున్న భయాందోళనలు, పతనమైన ఆర్థిక పరిస్థితి- ఇవన్నీ ప్రజలను నిరాశానిస్పృహలకు గురిచేశాయి. హురియత్ కాన్ఫరెన్స్‌కు చెందిన పక్షాలు ఈ ఎన్నికలను బహిష్కరించటంతోపాటు ఓటు వేయవద్దని పిలుపునిచ్చాయి. ఓటు వేయటానికి సాహసించినవారిని చంపేస్తామని ఉగ్రవాదులు బెదిరించారు. ఇప్పటికే ఓ మంత్రితో సహా చాలామందిని బలితీసుకున్నారు. లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, ఇతర సీమాంతర ఉగ్రవాద సంస్థలు హింసాకాండను ఉధృతం చేయటానికి విశ్వప్రయత్నం చేస్తున్నాయి. నేషనల్ కాన్ఫరెన్స్ పట్ల ప్రజలలో పెద్దగా భ్రమలు లేవు. హురియత్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఉద్యమకారులలో కొందరు మాత్రమే ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. ఆ రకంగా

ప్రజలకు ఈ ఎన్నికల్లో ఉత్సాహంగా ఓటు వేయడానికి అనుకూలమయిన పరిస్థితులేవీ లేవు. అయినా ఇంత పెద్దసంఖ్యలో ఓటు వేస్తున్నారంటే శాంతి కోసం ప్రజలు ఎంతగా తపిస్తున్నారో తెలుస్తోంది. అమెరికాలాంటి దేశాలలో కూడా సాధారణ ఎన్నికల్లో ఇంతకంటే ఎక్కువ శాతం ఓట్లు పోల్ కావు. రిగ్గింగు, ప్రలోభాలు లేకుండా, టెర్రరిస్టుల బెదిరింపులను సైతం లెక్కచేయకుండా అంతమంది ఓట్లు వేయటం అసాధారణమయిన విషయం. భద్రతాదళాలు బలవంతంగా ఓట్లు వేయించారని కొన్ని ఆరోపణలున్నాయి. కానీ అందుకు ఆధారాలేవీ లేవు. ఎందరో విదేశీ దౌత్యవేత్తలు, పత్రికా ప్రతినిధులు ఈ ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇల్లలకగానే పండగ కాదు. ఎన్నికలు సజావుగా జరిగి ఓ కొత్త ప్రభుత్వం ఏర్పడినంత మాత్రాన కాశ్మీర్ సమస్య పరిష్కారమయినట్టు కాదు. ఇంతటితో వేర్పాటువాదులు ఓడిపోయారని భావించి యధాస్థితిని కొనసాగిస్తే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉంది. ఈ ఎన్నికలు సమస్య పరిష్కారానికి కేవలం ఓ మార్గాన్ని చూపే అవకాశముంది. కాశ్మీర్ సంక్షోభం ఓ కొలిక్కిరావాలంటే ఎంతో సంయమనంతో, దూరదృష్టితో, చిత్తశుద్ధితో దీర్ఘకాలిక చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. అందుకు సమస్య మూలాలను పరిశీలించాల్సి ఉంటుంది. దేశ విభజన జరిగినప్పుడు కాశ్మీర్ రాజ్యం భారత్, పాకిస్తాన్‌లు రెంటిలోనూ చేరకుండా స్వతంత్రంగా ఉండాలని ఆశించింది. పాకిస్తాన్ ప్రభుత్వం చొరబాటుదార్లను పంపి కాశ్మీర్‌ను బలవంతంగా ఆక్రమించుకోవాలని ప్రయత్నించడంతో నాటి కాశ్మీర్ మహారాజు హరిసింగ్ అసాధారణ పరిస్థితులలో భారత్‌లో కాశ్మీర్‌ను విలీనం చేస్తూ ఒప్పందానికి వచ్చారు. ఆ తరువాత చొరబాటుదారులను భారత్ సైన్యం నిలువరించి దురాక్రమణను తిప్పికొట్టినా– కోల్పోయిన ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకోకుండా వివాదాన్ని అప్పటి ప్రధాని నెహ్రూ ఐక్యరాజ్యసమితికి నివేదించారు. పాక్ సైన్యం ఉపసంహరించుకోవాలని, ఆ తరువాత ఇరు ప్రాంతాలలోను ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని సమితి తీర్మానించింది. అయినా పాక్ తన సైన్యాన్ని ఉపసంహరించుకోలేదు. భారత్‌లో అంతర్భాగంగా జమ్ము–కాశ్మీర్‌లో ఎన్నికలు జరుగుతూ వస్తుండటంతోపాటు, వాస్తవాధీనరేఖకు ఆవల పాక్ ఆక్రమిత కాశ్మీర్ అలాగే కొనసాగింది. 1953లో షేక్ అబ్దుల్లా చర్యలకు విసిగి నెహ్రూ ప్రభుత్వం ఆయనను నిర్బంధించటం, ఇందిరాగాంధీ అధికారంలోకి వచ్చాక షేక్‌తో ఒప్పందం కుదుర్చుకుని ఆయనను విడుదల చేయటం, ఈలోగా కాశ్మీర్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ రిగ్గింగుకు పాల్పడిందనే అపప్రథ బాగా ప్రచారం కావటం, సాదిక్ అలీ ప్రభుత్వం రాజీనామా చేసి ఎన్నికలు జరిగాక షేక్ అబ్దుల్లా నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడటం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇవన్నీ చరిత్రలో అంతర్భాగమయ్యాయి. షేక్ అబ్దుల్లా మరణించాక ఆయన కుమారుడు ఫరూక్ అబ్దుల్లా అధికారంలోకి వచ్చారు. ఎలాగైనా ఫరూక్ అబ్దుల్లాను గద్దె దింపాలన్న లక్ష్యంతో– 1984లో కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అప్పటి గవర్నర్ బి.కె నెహ్రూను బదిలీ చేసి, ఆయన స్థానంలో జగ్‌మోహన్‌ను గవర్నర్‌గా నియమించింది. అధికార పార్టీలో చీలికలు సృష్టించి, ఫరూక్‌ను గద్దెదింపి, అతని బావమరిది జి.ఎం షా నాయకత్వంలో పార్టీ ఫిరాయించిన అందరికీ మంత్రి పదవులు కట్టబెట్టి, కాంగ్రెస్ బయట నుంచి మద్దతునిచ్చింది. ఆ విధంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్‌లో చేజేతులా చిచ్చుపెట్టింది. ఆ తరువాత ఫరూక్ అబ్దుల్లా కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడే సాహసం లేక, రాజీవ్‌గాంధీ అధికారంలో ఉండగా కాంగ్రెస్ పార్టీతో ఒప్పందం కుదుర్చుకుని మళ్లీ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. 1987లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ కలిసి పోటీ చేయటం, దాంతో ఆ రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా పోవటం, ఎన్నికలలో అధికార కూటమికి వ్యతిరేకంగా పోటీచేసిన అభ్యర్థులను అక్రమంగా ఓడించటం, యధేచ్ఛగా రిగ్గింగుకు పాల్పడటం, ఇవన్నీ కాశ్మీరీల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఆ పరిస్థితిని ఆసరాగా తీసుకుని పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ ఉగ్రవాదాన్ని ప్రేరేపించి, వేర్పాటువాదులకు శిక్షణనిచ్చి, పాకిస్థాన్ నుంచి కిరాయి సైనికులను పంపి, ఆయుధాలను సరఫరా చేసి హింసాకాండకు, ప్రచ్ఛన్న యుద్ధానికి పాల్పడింది. అలా రాజుకున్న నిప్పు నేటికీ చల్లారలేదు. 1989లో 48 గంటల వ్యవధిలో లక్షల సంఖ్యలో కాశ్మీరీ పండిట్‌లను తీవ్రవాదులు బెదిరించి కట్టుబట్టలతో వెళ్లగొట్టారు. అప్పటి నుంచి ఉగ్రవాదం, మానవాపహరణలు, మతతత్వం, హింసాకాండ, మైనారిటీ హిందువుల ఊచకోత, కొంతకాలం గవర్నర్ పాలన, ఎన్నికల పట్ల ప్రజల అనాసక్తి, భద్రతాదళాల మోహరింపు, భారత సైనికుల పట్ల ప్రజల విముఖత– ఇవన్నీ గత 13 ఏళ్లలో జరిగిన బాధాకర సంఘటనలు. ఈ నేపథ్యంలో అటు సీమాంతర ఉగ్రవాదం, ఇటు కాశ్మీరీ ప్రజలలో ప్రబలిన భారత వ్యతిరేకత నేడిప్పుడు మనల్ని పీడిస్తున్న తీవ్ర సమస్యలు. ఈ పరిస్థితుల్ని కూలంకషంగా బేరీజు వేయకుండా సమస్యకు పరిష్కారం సాధ్యం కాదు.

**నాలుగు సూత్రాలు**

ఎన్నికల తదుపరి నాలుగు మార్గాలలో పరిష్కారాన్ని

అన్వేషించాల్సిన అవసరం ఉంది. మొదటిది– కాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి. ఇప్పటికే రాజ్యాంగంలో 370వ అధికరణం ప్రకారం కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి ఉంది. ఆ రాష్ట్రానికి ప్రత్యేకంగా రాజ్యాంగం, పౌరసత్వం ఉన్నాయి. కాశ్మీర్ ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని నిర్ణయాలు తీసుకోవటం అవసరం. రక్షణ, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ, కమ్యూనికేషన్లు మినహాయించి దాదాపు అన్ని అంశాలను రాష్ట్రానికి బదిలీ చేయవచ్చును. కాశ్మీర్ గవర్నర్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించకుండా రాష్ట్ర చట్టసభలు ఎన్నిక ద్వారా నియమించే ఏర్పాటు చేయవచ్చును. తద్వారా కాశ్మీర్ ప్రజల స్వయంనిర్ణయాధికారాన్ని గౌరవించినట్లవుతుంది. రెండవది– అదే సమయంలో భారత్‌తో ఆర్థిక, సామాజిక విలీనాన్ని ప్రోత్సహించే చర్యలు చేపట్టటం అవసరం. దేశంలో ఎక్కడ పుట్టినవారయినా కాశ్మీర్‌లో నివాసం ఏర్పరచుకునే అవకాశం ఉండాలి. కాశ్మీరీలకు ఎలాగూ దేశమంతటా అన్ని హక్కులు ఉన్నాయి. స్వయంప్రతిపత్తికి సంబంధించిన ఏర్పాట్లతోపాటు పూర్తి విలీనానికి కూడా మార్గాన్ని సుగమం చేయటం అవసరం. అలాగే కొన్ని నిబంధనలకు లోబడి కాశ్మీర్‌లో ఎవరయినా ఆస్తిపాస్తులు పొందే హక్కు, అక్కడ నివాసమున్న వారందరూ అన్ని ఎన్నికలలో ఓటు వేసే హక్కు ఉండటం అవసరం. నాణేనికి ఓవైపు స్వయంప్రతిపత్తి, మరోవైపు పూర్తి విలీనం కొనసాగించాలి. ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ల పరిధి కాశ్మీర్‌కి విస్తరించరాదని ఆ రాష్ట్రంలో కొందరు కోరుతున్నారు. అది అసంబద్ధమైన, హ్రస్వదృష్టితో కూడుకున్న ప్రతిపాదన. నిజానికి ఈ రాజ్యాంగ సంస్థలు కాశ్మీర్ ప్రజల స్వేచ్ఛను పరిరక్షిస్తాయి. ఆ రాష్ట్రంలో సజావుగా ఎన్నికలు జరిగేలా చూస్తాయి. అక్కడ ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడతాయి. కేంద్రప్రభుత్వ దురుసుతనం నుంచి కూడా రాజ్యాంగ సంస్థలు రక్షణ ఇస్తాయి. అలాగే ఆర్థికసంఘం పరిధి కాశ్మీర్‌కు విస్తరించటం వల్ల ఆ రాష్ట్రానికి బాగా మేలు జరిగింది. మన సంప్రదాయం ప్రకారం కేంద్ర నిధుల బదిలీలో సరిహద్దుల్లోను, పర్వత ప్రాంతాల్లోను ఉన్న రాష్ట్రాలను ప్రత్యేక రాష్ట్రాలుగా పరిగణించి నిధుల కేటాయింపులో పెద్దపీట వేస్తున్నారు. కాబట్టి రాజ్యాంగ సంస్థల కాశ్మీర్‌లో కొనసాగటం అక్కడి ప్రజల సంక్షేమం దృష్ట్యా అత్యవసరం. యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్, భారత పరిపాలన సర్వీసుల పరిధి విషయంలో కొంత పట్టువిడుపులు ప్రదర్శించి కాశ్మీర్‌కు పూర్తి స్వేచ్ఛను ఇవ్వటం భావ్యమే. ఇక నాలుగో అంశం– ఆ రాష్ట్రంలోనే సత్పరిపాలనకు నిర్దిష్టమైన చర్యలు తీసుకోవటం. వీటితోపాటు ఆ రాష్ట్రంలో ఉన్న మూడు ప్రాంతాల (కాశ్మీర్ లోయ, జమ్ము, లడక్)కు ఎన్నికయిన ప్రాంతీయ బోర్డులను విడివిడిగా ఏర్పాటు చేసి వాటికి స్వయంప్రతిపత్తిని ఇవ్వటం అవసరం. రోజువారీ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు ఆ ప్రాంతీయ బోర్డుల పర్యవేక్షణలో జరిగితే అది కాశ్మీర్‌కు ఎంతో మేలు చేస్తుంది.

### చిత్తశుద్ధితో సంస్థాగత మార్పులు

కాశ్మీర్‌లో అవినీతి, అధికార దుర్వినియోగం రాజ్యమేలుతున్నాయి. ఆ రాష్ట్రంలో నేరపరిశోధనను రాజకీయాల నుంచి వేరుచేయటం, అధికారాన్ని పూర్తిగా వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం, అసెంబ్లీ కమిటీలను అంశాలవారీగా ఏర్పరిచి వాటికి పాలనలో చాలావరకు పాత్ర కల్పించటం, పాలనపై సమాచారహక్కు కోసం మంచి చట్టాన్ని రూపొందించి అమలు చేయటం, సిటిజన్స్ చార్టర్ల ద్వారా పౌరసేవలు నిజాయతీగా, సత్వరం అందే ఏర్పాట్లు చేయటం, అవినీతి నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టటం అవసరం. ప్రభుత్వాల పనితీరు పట్ల విసిగిపోయి, అపనమ్మకం బాగా పెంచుకున్న ప్రజలకు పాలన పట్ల విశ్వాసం పెరగాలంటే పాలకులు చిత్తశుద్ధితో సంస్థాగత మార్పులు తెచ్చి తమ జీవితాలు బాగుపడతాయనే విశ్వాసాన్ని వారిలో కలిగించాలి. కేంద్రం ఇస్తున్న అదనపు నిధులు సద్వినియోగమై ప్రజలకు అందేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలి. ఎన్ని చర్యలు తీసుకున్నా సీమాంతర ఉగ్రవాదం అంతరిస్తుందనుకోవటం పొరపాటు. అయితే పైన సూచించిన చర్యల వల్ల కాశ్మీర్ ప్రజలలో ఉగ్రవాదం పట్ల మద్దతు తగ్గిపోతుంది. పాకిస్తాన్, ఇతర దేశాలు, ఇస్లామిక్ తీవ్రవాద ఉద్యమాల జోక్యంతో ఉగ్రవాదం ఆ రాష్ట్రంలో మరికొంతకాలం కొనసాగటం ఖాయం. మానవ హక్కులను గౌరవిస్తూనే ఉగ్రవాద ముఠాలను నిర్దాక్షిణ్యంగా అణచివేయక తప్పదు. భద్రతాదళాలు ఏమాత్రం ఏమరుపాటు లేకుండా హింసాకాండను అంతం చేయాలి. సామాన్య ప్రజల హక్కులకు భంగం కలగకుండా చూడటం, నిరాయుధుల్ని బంధించి చంపుతున్నారన్న ఆరోపణలు లేకుండా వ్యవహరించటం అత్యవసరం. ఈ విధంగా పటిష్ట వ్యూహంతో వ్యవహరిస్తే వచ్చే అయిదేళ్లలో కాశ్మీర్‌లో మళ్లీ శాంతి, సామరస్యం, ఆర్థిక ప్రగతి సాధ్యం. ఈ కార్యాచరణ ప్రణాళికను దృఢచిత్తంతో, దీర్ఘకాలిక వ్యూహంతో, మౌలిక అంశాలలో రాజీపడకుండా అవసరం మేరకు పట్టువిడుపులతో అమలుచేస్తే 20 ఏళ్లుగా కాశ్మీర్ ప్రజలను, దేశం మొత్తాన్ని కుదిపివేసిన ఉగ్రవాదం, వేర్పాటువాదం నిస్సందేహంగా అంతరిస్తాయి.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా సెప్టెంబర్ 20, 2002న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం) ★

## చైనాను అధిగమించాలంటే సహకార వ్యవస్థ కీలకం



ఆర్థిక వృద్ధిలో భారత్ చైనాను అందుకోవాలంటే కొన్నేళ్లపాటు భారీ వృద్ధి రేటుతో స్థిరంగా పురోగమించాల్సి ఉంటుందని రిజర్వుబ్యాంకు గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. భారత్‌తో పోలిస్తే చైనా తలసరి జాతీయోత్పత్తి నాలుగు రెట్లు ఎక్కువగా ఉందన్నారు. కొన్ని సంవత్సరాల వృద్ధి రేటుతో చైనాను దాటటం సాధ్యం కాదన్నారు. భారత్‌లో భారీ వృద్ధి తర్వాత మందగమనం ప్రవేశించిందని, ఇలా నిలకడ లేని వృద్ధితో మనం చైనాతో పోటీపడలేమని అన్నారు. గ్రామీణస్థాయిలో ఆర్థిక సమ్మిళిత (ఫైనాన్షియల్ ఇంక్లూజివ్) అభివృద్ధి జరిగినప్పుడే భారత్‌లో స్థిరమైన అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు సహకార రంగాన్ని సద్వినియోగం, బలోపేతం చేసుకోవటం అవసరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఇప్పటికీ వడ్డీ వ్యాపారులపైనే ఆధారపడుతూ వస్తున్నారని గుర్తుచేశారు. ఒకప్పుడు సహకార బ్యాంకులు గ్రామీణాభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడేవని, ప్రస్తుతం ఇవి వీటికి దూరంగా ఉండటం విచారకరమైన విషయమని అన్నారు. సహకార స్ఫూర్తి నుంచి మన వ్యవస్థ ఎందుకు పక్కకు తొలగిందో ఆలోచించా లన్నారు. కాగా, సహకార వ్యవస్థ స్వయంప్రతిపత్తి కోసం 97వ రాజ్యాంగ సవరణను తీసుకురావటం (2012)తోపాటు తెలుగు రాష్ట్రాల్లో సహకార సంఘాల స్వతంత్ర ప్రతిపత్తి కోసం అనేక పోరాటాలు చేస్తున్న లోక్‌సత్తా.. తాజాగా తెలంగాణ ప్రభుత్వం సహకార సంఘాలపై పెత్తనం చేసేందుకు తెచ్చిన జీవోపై కూడా పోరాటం ప్రారంభించింది. ఈ పోరాటంలో కూడా లోక్‌సత్తా విజయం సాధించి సహకార సంఘాల స్వయంప్రతిపత్తిని పరిరక్షిస్తుందని ఉద్యమ వర్గాలు తెలిపాయి.

## తెలుగు రాష్ట్రాల్లో భారీగా పెరుగుతున్న మద్యం అమ్మకాలు

మద్యం మత్తు వల్ల ఎంత వినాశనం జరుగుతుందో చెప్పటానికి హైదరాబాద్‌లో చిన్నారి రమ్య కుటుంబంలో జరిగిన విషాదం తాజా ఉదాహరణ. అయితే విషాదాలు జరుగుతున్నా, ఓ పక్క కేసులు నమోదు చేస్తున్నా, తీవ్ర ఆర్థిక, ఆరోగ్యపరమైన విపరిణామాలు సంభవిస్తున్నా కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మద్యంపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల అమ్మకాలు నానాటికీ పెరుగుతున్నాయి. మద్యాన్ని ప్రభుత్వాలు ఆదాయవనరుగా మార్చుకోవటం వల్ల 2015-16 ఆర్థిక సంవత్సరంలో కంటే 2016-17 ఏప్రిల్, మే నెలల్లో తెలంగాణలో మద్యం అమ్మకాలు 31.60శాతం పెరిగాయి, ఏపీలో 25.64శాతం పెరిగాయి. కేరళలో ఈ పెరుగుదల శాతం కేవలం 5.89శాతం మాత్రమే ఉండగా, కర్ణాటకలో మద్యం అమ్మకాలు 2.18 శాతం తగ్గటం విశేషం.

## పనిచేసే సెజ్‌లు 204, పనిచేయనివి 226

దేశంలో ప్రస్తుతం 204 ప్రత్యేక ఆర్థిక మండళ్లు (సెజ్) పనిచేస్తున్నాయని, మరో 226 మూలన పడ్డాయని కేంద్ర వాణిజ్యమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభకు తెలిపారు. సెజ్‌ల చట్టం-2005 ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన సెజ్‌లలో 38 పడకేశాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో 19 పనిచేస్తుంటే, 11 మూలన పడ్డాయి. తెలంగాణలో 26 పనిచేస్తుంటే, 27 విధులు నిర్వర్తించటం లేదు. అత్యధికంగా కర్ణాటకలో 36, మహారాష్ట్రలో 35 సెజ్‌లు పనిచేయటం లేదు.

## విదేశీ విద్యపై వ్యయం రూ.12,672కోట్లు.. సెజ్‌లలో ప్రాంగణాల ఏర్పాటు ప్రతిపాదన

భారతీయ విద్యార్థులు 2015-16 ఆర్థిక సంవత్సరంలో విదేశీ విద్యపై చేసిన ఖర్చు రూ. 12,672కోట్లు. ఈ నేపథ్యంలో సెజ్‌లను వినియోగించుకుని అక్కడ విదేశీ విశ్వవిద్యాలయాల ప్రాంగణాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఊపందుకుంటోంది. అనేకమంది భారతీయ విద్యార్థులు విద్యాభ్యాసం కోసం విదేశాలకు వెళుతున్నారని, అలాంటి కోర్సుల్ని అవే సంస్థల చేత భారత్‌లోనే అందిస్తే యువతకు ఆర్థికంగా కూడా వెసులుబాటు ఉంటుందని భావిస్తున్నారు. ఆకర్షణీయంగా లేని పన్నుల విధానం కారణంగా అనేక సెజ్‌లలో భూములు ఖాళీగా ఉన్నాయని, ఇక్కడ పన్ను రాయితీల వల్ల విదేశీ విశ్వవిద్యాలయాలకు కూడా లాభాలు బాగా ఉంటాయని హెచ్ఆర్‌డీ అధికారులు అంటున్నారు. అత్యుత్తమ వర్సిటీల్లో కొన్నింటితోపాటు ద్వితీయ శ్రేణి విదేశీ విశ్వవిద్యాలయాల ప్రాంగణాలు వచ్చినా మనకు మేలేనంటున్నారు. ఇదే తరహా బిల్లును 2010లో యూపీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

# కోర్టుల్లో మురుగు

- పి.వి గోపాలకృష్ణ,
న్యాయవాది

**కోర్టులలో కేసులు మురిగిపోతున్నాయి.**

విజయ్ మాల్యా మీద ఒక కేసు డెబ్బయి సార్లు ఎందుకు వాయిదా పడిందో సుప్రీంకోర్టుకే అర్థం కాని ప్రశ్న. న్యాయవ్యవస్థ లసుగుల్ని ఆసరాగా తీసుకుని మాల్యా దేశం నుంచి జంప్ అయ్యారు (సుప్రీంకోర్టు అమాయకత్వాన్ని నటిస్తే, దేవుడు కూడా ఈదేశాన్ని కాపాడలేడు). మన రాష్ట్రానికే చెందిన మరో మాల్యా దాఖలు చేసిన సీఆర్ఎల్పీలో మన హైకోర్టు ఆదేశించిన మధ్యంతర ఉత్తర్వుల కాలపరిమితి ముగిసి సరిగ్గా సంవత్సరం పూర్తయినా, ఈ సంవత్సర కాలంలో ఇంకా విచారణకి నోచుకోకుండా ముగ్గురు జడ్జీల పోర్ట్‌ఫోలియోలు మారాయి. ఆ కారణంలో దిగువ కోర్టులో గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతూన్న కొన్ని కోట్ల రూపాయల రెండు చెక్ బౌన్స్ కేసులు మురుగుతూ ఉన్నాయి.




కోర్టుకి వచ్చిన కేసులు పూర్తి కావలసిన కాలం చట్టాలలో నిర్దిష్టంగా ఉన్నా ఆ కాలపరిమితుల్లో వ్యాజ్యాలు పరిష్కారం కాకపోవటానికి కారణాలు వెతకవలసిన అవసరం లేదు. జనాభా నిష్పత్తికి తగిన కోర్టులు, అంటే జడ్జీలు లేకపోవటం ముఖ్య కారణం. జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ (ఎన్‌జేడీజీ) లెక్కల ప్రకారం వివిధ కోర్టుల్లో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా నిలువరించి ఉన్న కేసుల సంఖ్య రెండు కోట్లకి పైబడే. రెండు కోట్ల ఏడు లక్షల డెబ్బయి ఎనిమిది వేల ఏడువందల యాభై ఆరు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలో 4,16,655, తెలంగాణ హైకోర్టు పరిధిలో 3,53,091. సివిల్, క్రిమినల్ కోర్టుల్లో ప్రస్తుతం అపరిష్కృతంగా ఉన్న కేసుల సంఖ్య అది.

ఇద్దరి మధ్య ఉన్న అభిప్రాయభేదాలు కేవలం కోర్టులలో మాత్రమే పరిష్కరించుకోవలసిన అవసరం లేకుండా ఎన్నో ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేసినా వాటిని ఆచరణలోకి తీసుకురావలసిన ముఖ్యమైన బాధ్యతను అడ్వకేట్లు తీసుకోకపోవటం కూడా కారణమే. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదుల మండలి (బార్) నుంచి తగిన సహకారం లభించడం లేదని, పెరిగిపోతున్న అపరిష్కృత వ్యాజ్యాల సంఖ్య వల్ల న్యాయవ్యవస్థ విశ్వసనీయతను కోల్పోతోందని ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఠాకూర్ కూడా తాజాగా వాపోయారు. కేవలం శనివారాలతో సహా పనిదినాలు పెంచటం, దసరా/క్రిస్మస్/సంక్రాంతి, వేసవి సెలవల రద్దు, జడ్జీల సంఖ్య పెంచడం వంటి మార్పులతో పాటు, దిక్కులేక కోర్టు మెట్లెక్కినవారి బాధలను దృష్టిలో ఉంచుకుని తమ సమస్యల పరిష్కారానికి కోర్టు బహిష్కరణ మార్గాన్ని న్యాయవాదులు ఎన్నుకోకుండా ఉంటే న్యాయవ్యవస్థ విశ్వసనీయత మరింత పెరుగుతుంది. జాతీయ అపీల్ కోర్టు (నేషనల్ కోర్ట్ ఆఫ్ అపీల్) ఏర్పాటు కోసం సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజనం కోసం వి. వసంత కుమార్ అనే పాండిచ్చేరి న్యాయవాది దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ఐదుగురు జడ్జీల విస్తృత సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 4న విననుంది. ప్రజలందరికీ సత్వర న్యాయాన్ని అందించటంలో ప్రభుత్వం ఎన్నో మౌలికమైన మార్పులకి సిద్ధపడాలి. ఈ జాతీయ అపీల్ కోర్టు కేవలం చెన్నై, ముంబయి, కోల్‌కతాలకే పరిమితమైతే విస్తృత ప్రయోజనాన్ని సాధించలేవు. ప్రజలందరికీ త్వరితగతిన తక్కువ ఖర్చుతో న్యాయాన్ని అందించటం ప్రభుత్వ ప్రధానోద్దేశమైతే ప్రతి రాష్ట్ర రాజధానిలోనూ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. కానీ ఏ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చినా ప్రాథమ్యాల జాబితాలో సత్వరన్యాయం అడుగున ఎక్కడో ఉంది.

1998 ఏప్రిల్‌లో లా కమిషన్ తనంతతానుగా ప్రభుత్వానికి ఒక సూచనను పంపింది. అప్పుడు కేంద్ర న్యాయశాఖా మంత్రి తంబిదురై. ఈనాటికీ ఆ సూచనను పట్టించుకున్న నాథుడే లేడు. ఇది ఈదేశంలో అత్యధిక సంఖ్యాక ప్రజలకు పెద్ద సమస్యగా ఉన్న స్థిరాస్తి లావాదేవీలకు సంబంధించినది.

నేనొక స్థిరాస్తిని కొన్నాననుకుందాం. నా ఖర్మకొద్దీ నాకమ్మిన వ్యక్తికి నిజాయతీ పాళ్లు తక్కువవటం వల్ల ఆ ఆస్తి మీద అప్పటికే కోర్టులో కేసు జరుగుతున్న విషయం నాకు చెప్పకుండా అమ్మాడనుకుందాం, ఆ విషయం నేను తెలుసుకునే విధంగా ప్రస్తుతం మన ప్రభుత్వ యంత్రాంగం లేదు. అంటే ఏ రిజిస్ట్రార్ ఆఫీసులోనో ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) తీసుకుని ఆ ఆస్తికి సంబంధించిన లావాదేవీలు తెలుసుకునే విధంగా ఆ ఆస్తి మీద ఉన్న కేసులను తెలుసుకోవడానికి కావలసిన సావకాశం మన ప్రభుత్వం కల్పించలేదు. అంటే తనంత తానుగా అమ్మే వ్యక్తి చెబితే తప్ప కోర్టు కేసుల విషయం తెలిసే అవకాశం లేదు. మన రెండు తెలుగు రాష్ట్రాలలోను, మన పక్కనున్న తమిళనాట కూడా ఇదే పరిస్థితి. అలా కొనుకున్నవాళ్ల గతి సెక్షన్ 52, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్టు, 1882 పరిధిలోకి వచ్చి శ్రీ కోర్టువారి నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. నా ప్రమేయం లేకుండానే కోర్టు కేసులో తగులుకున్నానని తెలిసేసరికి పుణ్యకాలం దాటిపోయి ఉంటుంది. అప్పుడు నేను నాకమ్మిన వాడి మీద మరో కేసు వేసి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉండాలి. కానీ మనకి మరో పక్కనున్న మహారాష్ట్ర, ఇంకా గుజరాత్‌లో పరిస్థితి మెరుగ్గా ఉంది. 1939లోనే, అంటే 76 ఏళ్ల క్రితమే సెక్షన్ 52తోపాటు రిజిస్ట్రేషన్ యాక్టు, 1908, సెక్షన్ 18ని సవరించారు. సవరణ వారి రాష్ట్రానికి పరిమితం. ఈ సవరణ వల్ల కోర్టులో కేసు వేసినవారు రిజిస్ట్రార్ ఆఫీసులో నోటీస్ ఆఫ్ పెండింగ్ లిటిగేషన్‌ని రిజిస్టర్ చేసే సావకాశం కలిగింది. అందువల్ల ఏదైనా కోర్టులో ఆ స్థిరాస్తి మీద ఏదైనా కేసు పెండింగ్‌లో ఉంటే ఆ విషయం ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్‌లో బయటపడుతుంది.

డెబ్బయి ఆరేళ్లుగా మన పాలకులకు తట్టనిది, పక్కరాష్ట్రంలో ఏం జరుగుతుందో పట్టని మన ఏలికలకి 1998లో తనంతతానుగా లా కమిషన్ ఈ సూచనని చేసింది. సెక్షన్ 52 స్థిరాస్తి బదలాయింపు చట్టం, 1852తోపాటు రిజిస్ట్రేషన్ చట్టం, 1908, సెక్షన్ 18కి సవరణలు చేయవలసిన అవసరాన్ని, అందువల్ల వచ్చే ప్రయోజనాలని స్పష్టంగా తన 157వ రిపోర్టులో చెప్పింది. అది జరిగి దశాబ్దమున్నరకిపైగా అయింది. 157వ రిపోర్టుతోపాటు జస్టిస్ జీవన్‌రెడ్డి ఛైర్మన్‌గా అప్పటి లా కమిషన్ కేంద్ర న్యాయశాఖా మంత్రికి పంపిన ఉత్తరంలో.. స్థిరాస్తి బదలాయింపు చట్టానికి అప్పటికి ఇరవై ఒక్క సంవత్సరాల క్రితం (1977లో) శాంతిభూషణ్ కేంద్ర న్యాయశాఖా మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన 70వ రిపోర్టు ఇంకా అమలుకు నోచుకోలేదన్న విషయాన్ని గుర్తుచేస్తూ, రిపోర్టులోని సిఫార్సులను అమలుచేస్తే స్థిరాస్తి కొనుగోలుదారులకు తక్షణ రక్షణ కలుగుతుంది అని కూడా స్పష్టంచేసింది. ప్రధానంగా ఆ సూచనలను అమలుచేస్తే కలిగే ప్రయోజనాలలో ఒకటి, కోర్టులో కేసు ఉన్న విషయం ముందుగా తెలిస్తే అటువంటి స్థిరాస్తి జోలికి ఎవరూ పోరు. తద్వారా కోర్టుల్లో పేరుకుపోయే కేసుల సంఖ్యా తగ్గుతుంది. రిజిస్ట్రేషన్ ఆఫ్ నోటీస్ ఆఫ్ పెండింగ్ లిటిగేషన్‌కి వసూలు చేసిన ఫీజు వంద రూపాయలుగా 157వ రిపోర్టులో లా కమిషన్ సూచించింది. ఇంతవరకు లా కమిషన్ 262 రిపోర్టులను ప్రభుత్వానికి అందచేసింది. అందులో కొన్ని ప్రభుత్వ కోరిక మీద, మరికొన్ని తనంతతానుగా ఇచ్చినవి. వాటిలో ఎన్ని అమలుకు నోచుకున్నవో పరిశోధించాలి. ప్రస్తుతం పనిచేస్తున్నది 21వ లా కమిషన్.

దేశంలోని కోర్టులోని కేసుల సమాచారాన్ని ఇంటర్నెట్ ద్వారా అందరూ తెలుసుకునే అవకాశాన్ని జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ కలగజేసింది. ఈ వ్యవస్థ ద్వారా ఏ కోర్టులోనైనా ఏదైనా కేసు పెండింగ్‌లో ఉందా అనే సమాచారం కూడా ప్రజలకు అందుబాటులో ఉంచవలసిన అవసరాన్ని తెలియచేస్తూ అకాడమీ ఆఫ్ లీగల్ లిటరసీ ఫర్ ఆల్ (ఆల్ ఫర్ ఆల్) ఒక విజ్ఞప్తిని సుప్రీంకోర్టు ఈ–కమిటీకి 2014 అక్టోబర్‌లో అందచేయటం జరిగింది. క్రెడాయ్ (కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) కూడా ఈ సూచనను సమర్థిస్తూ తమ అనుకూల్యతను ఈ–కమిటీకి తెలియచేసింది. ఈ చర్యల ప్రజోపయోగ్యత ఇంకా అనుభవంలోకి రావలసి ఉంది. కేంద్ర ప్రభుత్వం ద్వారా లేదా రాష్ట్రాల ద్వారానైనా ఈ లోపాల్ని చక్కదిద్దేందుకు లోక్‌సత్తా తనవంతు ప్రయత్నం చేస్తోంది. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులకు ఈ అంశంపై ప్రతిపాదిత సవరణ సహా లేఖ రాశారు. మంచిరోజు కోసం ఎదురుచూస్తూ ఉందాం.

సార్...సార్...సార్... దున్నపోతు మీద వాన అంటే ఏమిటి సార్...? ★

## ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

### -లోక్‌సత్తా పార్టీ డిమాండ్‌తో గొంతు కలిపిన కాంగ్రెస్, వైకాపా, వామపక్షాలు, బీఎస్పీ-



రాష్ట్రంలో బాగా వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలన్న లోక్‌సత్తా డిమాండ్‌కు ప్రతిపక్ష పార్టీలు కూడా గొంతు కలిపాయి. ఈ డిమాండ్‌తో విజయనగరం బాలాజీ కూడలి అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, రాష్ట్ర ఎంపీలు దద్దమ్మల్లా వ్యవహరిస్తున్నారని, కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి వెనకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక హోదా తేలేకపోతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేలేకపోతే కనీసం ఉత్తరాంధ్ర, సీమ జిల్లాలకైనా ఇప్పించుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ సహా దేశవ్యాప్తంగా వెనకబడిన 100 జిల్లాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన ప్రతిపాదన దేశవ్యాప్తంగా ఆమోదయోగ్యమవుతుందని, మన నాయకులకు సత్తా లేకపోవటమే అసలు సమస్యని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు యడ్ల ఆదిరాజు, వైకాపా ఎస్సీ సెల్ నాయకుడు జైహింద్ కుమార్, సీపీఎం కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీపీఐ ప్రతినిధి బుగత అశోక్, బీఎస్పీ మహిళా విభాగం ప్రతినిధి చెన్నా రాణి, లోక్‌సత్తా నాయకులు తేజో రాణి, రవి, బి. రమేష్, రాజారావు, తెరపల్లి శ్రీనివాసరావు, పెనుమజ్జి సత్యనారాయణ, చోడి ఆదినారాయణ, రామవరపు రామారావు, దుర్గారావు తదితరులు పాల్గని, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం మంత్రులు, ఎంపీలు చొరవ చూపకపోవటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

## జిల్లా కలెక్టర్‌కూ మెమోరాండం

వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక హోదా డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి అధికారికంగా కూడా తీసుకెళ్లాలని కోరుతూ అంతకుముందు జిల్లా కలెక్టర్ ఎం.ఎం నాయక్‌కు కూడా పార్టీల నేతలు మెమోరాండం సమర్పించారు. విజయనగరం జిల్లాలో రెండేళ్ల క్రితం పరిశ్రమలు మూతపడి దాదాపు 30వేల కుటుంబాలు వీధిన పడినా, పేద పిల్లలు ఉండే హాస్టళ్లను మూసివేస్తున్నారని వారు వివరించారు.

ప్రభుత్వ వైద్య కళాశాల కావాలని అడిగినా మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నారన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు మలేరియా, పట్టణాల్లో డయేరియా వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు ఎంత వెనకబడివున్నాయో వాస్తవ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, జిల్లా యూనిట్‌గా ప్రత్యేక హోదా ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు విజ్ఞప్తి చేశారు.

## రూ.1.71 లక్షల కోట్ల మాఫీ

దేశవ్యాప్తంగా గత మూడేళ్లలో వివిధ వ్యక్తులు, సంస్థలు తీసుకున్న రుణాల్లో రూ.1.71 లక్షల కోట్లను బ్యాంకులు పూర్తిగా మాఫీ చేశాయని ఆర్థిక శాఖ సహాయమంత్రి సంతోష్ గంగ్వార్ రాజ్యసభకు తెలిపారు.

## 5 నుంచి రియో ఒలింపిక్స్

బ్రెజిల్ రాజధాని రియోలో ఒలింపిక్స్ ఆగస్టు 5 నుంచి 21 వరకు జరగనున్నాయి. రియో 2016 ఒలింపిక్స్ వ్యయం అంచనాలను మించి రూ.1.4లక్షల కోట్లకు చేరింది. ఇందులో 207 దేశాలు పాల్గొంటున్నాయి.

# పేద, మధ్యతరగతి ఆరోగ్య ఘోషకు పాటనవుతా



వైద్యం కోసం సామాన్య ప్రజలు పడుతున్న అవస్థలు, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అమానుషమని, మనం ఆధునిక ప్రజాస్వామ్యంలో ఉన్నామని చెప్పుకోవటం సిగ్గుచేటని ప్రముఖ సినీ గేయరచయిత, గాయకుడు, తెలంగాణ అభ్యుదయ కవి జయరాజ్ అన్నారు. ఆరోగ్యం ప్రభుత్వ మౌలిక బాధ్యత అని తెలియక, చికిత్సకు డబ్బులేక వైద్యసేవల కోసం యాచకుల్లా మారిన, అప్పుల పాలవుతున్న, ప్రాణాలు కోల్పోతున్న కోట్లాది మంది పేదల రోదనను పాటగా మలుస్తానన్నారు. లోక్‌సత్తా పార్టీ నేత భీశెట్టి బాబ్జీతో కలిసి విజయనగరంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ప్రతి బిడ్డకూ నాణ్యమైన ఆరోగ్యం, విద్యలను అందించేలా ప్రభుత్వంపై ఏళ్ల తరబడి పోరాడుతున్న లోక్‌సత్తా కృషి అభినందనీయమన్నారు. గిరిపుత్రులు, సముద్రపుత్రులు, పేద, మధ్యతరగతి, బహుజనుల కోసం జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కోసం లోక్‌సత్తా చేస్తున్న ప్రయత్నాలకు జయరాజ్ మద్దతు పలికారు. విజయనగరంలో ప్రభుత్వాసుపత్రి కోసం ప్రజాసంఘాలన్నిటినీ కూడా కలుపుకుని పోరాడతామని బాబ్జీ తెలిపారు. దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఆదాడ మోహన్, న్యాయవాది రాజేంద్ర, రమణి, భాస్కర్ తదితరులు ఆసుపత్రిని సందర్శించినవారిలో ఉన్నారు.

# 'మార్పు' సాధించటానికి విద్యార్థులు, యువత థాట్ లీడర్స్‌గా ఎదగాలి: జేపీ








ఆదర్శ భావాలలో, ఉరిమే ఉత్సాహంలో చరిత్రలోని ఏతరంలోని వారికీ నేటి విద్యార్థులు, యువత తీసిపోరని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. గత తరంవారి భుజాల మీద నిలుచుండటం వల్ల వారి కంటే ఎక్కువగా కూడా చూడగలుగుతున్నారని అన్నారు. అయితే కేవలం సాంకేతిక పరిజ్ఞానం, ఉత్సాహం, ఆదర్శ భావాలతో మనం ఆశిస్తున్న మార్పుల్ని సాధించలేమన్నారు. నిజమైన మార్పు కోసం విద్యార్థులు, యువత పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని, సరైన పరిజ్ఞానంతో స్థానికంగా ఎక్కడికక్కడ శాంతియుతంగా ప్రజల సహకారంతో పోరాడటం మొదలుపెట్టాలని అన్నారు. హైదరాబాద్‌లోని లోక్‌సత్తా ప్రజాస్వామ్య శిక్షణా సంస్థలో రాజీవ్, పవన్ ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల శిక్షణా కార్యక్రమంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమాజం, రాజ్యం, పౌరసత్వం, పరిపాలన, ప్రభుత్వం, మానవ నాగరికత పరిణామం చెందుతూ వచ్చిన దశలు తదితర మౌలిక అంశాల మీద విద్యార్థి దశ నుంచే అవగాహన ఉంటే యువతలో ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. ఆలోచనా శక్తితో స్థానిక సమస్యలపై పోరాడే థాట్ లీడర్స్‌గా విద్యార్థులు, యువత ఎదగటం ఇప్పుడు కావాలన్నారు. పదవులు, హోదాల కోసం చూసుకోకుండా వ్యవస్థలో మార్పునకు పునాది వేసే ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను తరచుగా నిర్వహించాలని విద్యార్థి నాయకులకు జేపీ సూచించారు.

గత పది సంవత్సరాలుగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి

పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు



**PULLAGURA JOHN**

**ADVOCATE**

**CHILAKALURIPET -522 616**
**GUNTUR DISTRICT , A.P.,**
**CELL : 88863 11119**

*Best Wishes*

గత పది సంవత్సరాలుగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి
పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

# C.R. CLUB
# CHILAKALURIPET






Posting Date 07-08-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on August 1st 2016

# నిజాలు మాట్లాడుకుందాం-2

లోక్ సత్తా పోరాటాలకి ప్రజల స్పందన లేకపోతే...

నేరచరితుల వివరాలు బయటపెట్టే చట్టం ఎలా తీసుకు వచ్చాం?
పార్టీలకు నిధులు ఇచ్చే చట్టం ఎలా తీసుకురాగలిగాం
సమాచార హక్కు చట్టాన్ని ఎలా తీసుకువచ్చాం ?

## ఇవి విజయాలు కాదా ?

మిగతా పార్టీలు ఏమీ సాధించకుండా పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి ఆర్భాటాలు చేస్తే విజయం, పేపర్లలో హెడ్ లైన్స్ లో రాకపోతే పరాజయం అనుకుంటే అంతకంటే మూర్ఖత్వం లేదు.

ఎవరికి నచ్చినా నచ్చక పోయినా
ఇవి పచ్చి నిజాలు ...
లోక్ సత్తా విజయాలు।



షేర్ చెయ్యండి...ప్రజలకు నిజాలు చేరవేయండి

| Book-Post<br>PRINTED MATTER<br><br>If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | To |
| --- | --- |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad